# మెహెర్‌బాబా

**అవతార్ మెహెర్‌బాబాకే అంకితమైన మాసపత్రిక**



సంపుటి: 27 సంచిక: 02 హైదరాబాద్ 2026 జూన్ పేజీలు: 40

Please visit : www.srimeherbaba.com విడిప్రతి 20/-

# కొత్త పుస్తకం




**'మెహెర్‌బాబా మండలి సభ్యులు – పరమాత్మకు ఆంతరంగికులు'. అవతారునికి తమ సర్వస్వం అర్పించి** ఆయన పాదాల చెంత నిలిచి తరించిన ధన్యజీవులు. అనుక్షణం అవతారుని నామస్మరణతోనే కాలం గడిపిన వీరి అపురూప జీవిత చిత్రాలు చదువుతుంటే భక్తిభావంతో ఒళ్ళు గగుర్పొడుస్తుంది. అవతారుని ఎడల వీరికి వున్న ప్రేమ, విధేయత, క్రమశిక్షణ, అంకితభావం, నిష్కల్మష నిజాయితీ గురించి ఎన్నిసార్లు చదివినా, విన్నా, మరోమారు ఆలకించాలనే తపన కలుగుతుంది. మెహెర్‌బాబా సందేశాలు చాలా సరళంగా వుంటాయి. అవి చదవడానికి ఎంత సులభంగా అనిపించినా, ఆచరణలో అసాధ్యమని చాలామంది భావిస్తుంటారు. కానీ, అలాంటి అనితరసాధ్యమైన బాబా సందేశాలను నూటికి నూరు శాతం తమ జీవితాల్లో అన్వయించుకుని చూపిన మహనీయులు ఈ మండలి సభ్యులు. నేడు ఎగువ మెహెరాబాద్‌లో స్త్రీ మండలి, దిగువ మెహెరాబాద్‌లో పురుష మండలి సమాధులు వున్నాయి. ఆ అద్వితీయ భాగవతోత్తముల జీవిత విశేషాలను **'మెహెర్‌బాబా మండలి' పేరిట** ఒక అందమైన పుస్తక రూపంలో ప్రచురిస్తున్నాం. మా ఈ సుదీర్ఘ ప్రయత్నం ఇప్పుడు తుదిదశకు చేరుకుంది. కాలక్రమేణా ఈ మహనీయుల గురించిన సమాచారం కథలు కథలుగా మారి, భవిష్యత్తులో ఎలాంటి రూపాంతరాలకు లోనుకాకుండా ప్రామాణికంగా ఉంచడం మన బాధ్యత. అందుకే, సమగ్రమైన, సాధికారికమైన సమాచారాన్ని సేకరించి, క్లుప్తంగా నేటి పాఠకులకు అందజేయాలన్నదే ఈ పుస్తకం ప్రచురణ ప్రధాన ఉద్దేశం. **మరింత సమాచారం త్వరలో...**

## బాబా సందేశం

నిజమైన ఆనందం కోరుకునే వారు,
తమపట్ల కఠినంగానూ, ఇతరులపట్ల
ఎంతో సహనంగా వుండాలి.

–మెహెర్‌బాబా

గౌరవ సంపాదకులు
మల్లాది కృష్ణానంద్
**99595-53218,**
**malladisukku@gmail.com**

వ్యవస్థాపకులు:
శ్రీ దశిక ప్రసాదరావు

## లోపలి పేజీలలో...

| | | |
|---|---|---|
| 1. | సంపాదకీయం | 5 |
| 2. | 1925 జూలై 10 | 6-8 |
| 3. | ఫ్రెడ్ మార్క్స్ | 9-18 |
| 4. | వర్ని కేంద్ర వార్షికోత్సవం | 19 |
| 5. | లార్డ్ మెహెర్ | 20-24 |
| 6. | విశ్వకళ్యాణం కోసం | 25 |
| 7. | జీవిత సర్క్యులర్ | 26-28 |
| 8. | విశ్వ సందేశం | 29-30 |
| 9. | బాబా పాదసేవ - సందేశం | 31 |
| 10. | మా మాటలు | 32-35 |
| 11. | వరమొసంగు దేవా | 36 |
| 12. | మెహెర్‌బాబా ఎవరు? | 37-38 |
| 13. | మా ప్రచురణలు | 39 |
| 14. | జీవితసభ్యులు | 40 |

**ఉత్తర ప్రత్యుత్తరాలకు**

ఎడిటర్,
మెహెర్‌బాబా,
గోదావరి గార్డెన్స్, యాప్రాల్,
ప్లాట్ నెం. 32,
జె.జె. నగర్ కాలనీ,
సికింద్రాబాద్-500 087
ఫోన్: 99595 53218

**ముఖ చిత్రం**
మెహెర్‌బాబా సమాధి ప్రాంగణం, మెహెరాబాద్

### మనవి

**మీ వ్యాసాలు, ఇతర సమాచారం మాకు ప్రతినెల 10వ తేది లోపల పంపవల్సింది. మెహెర్‌బాబా పత్రికను ప్రతినెలా 26న హైదరాబాద్‌లో పోస్టు చేస్తున్నాం.**

***

# మనోనాశ్-అమృతోత్సవాలు

## 1951 -2026

**అవతారుడు మనోనాశ్ కార్యక్రమం చేపట్టి 2026 అక్టోబరు నాటికి 75 సంవత్సరాలు నిండుతున్నాయి.** 1949 అక్టోబర్ 16న బాబా నవజీవనం ప్రారంభించిన విషయం పాఠకులకు తెలుసు. నవజీవనానికి ముగింపుగా 1951 అక్టోబరు 16 నుండి 23 దాకా ఖాజాగూడ కొండపై వున్న చిన్న గుహలో మెహెర్‌బాబా **మనోనాశ్** కార్యక్రమాన్ని నిర్వహించారు. 1951 అక్టోబరు 24న హైదరాబాద్ నుండి కాలినడకన మెహెరాబాద్‌కి బయల్దేరారు. ఈ సందర్భంగా, హైదరాబాద్‌లో రెండు రోజుల మనోనాశ్ అమృతోత్సవ వేడుకలు 2026 అక్టోబరు 17న జూబ్లీ బాబా కేంద్రంలో, అక్టోబరు 18న మనోనాశ్ గుహ ప్రాంగణంలో ఏర్పాటు చేశారు. బాబా ప్రేమికులు పెద్దసంఖ్యలో పాల్గొన వల్సిందిగా నిర్వాహకులు కోరుతున్నారు. దూరప్రాంతాల నుండి విచ్చేయు వారికి తగిన వసతి సౌకర్యం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. **ఇందుకు ఆఖరు తేది 2026 జూలై 31.** మరిన్ని వివరాలకు వాట్సప్ నంబర్లు - 9849046848, 9652422599, 9396702076, 924652609 సంప్రదించగలరు. **అందరూ ఆహ్వానితులే.**

---

# మౌన వార్షికోత్సవం - ఆంధ్ర రెస్ట్ హౌస్‌లో వసతి

2026 జూలై 10 మౌన వార్షికోత్సవం సందర్భంగా మెహెరాబాద్‌కి విచ్చేసే బాబా ప్రేమికులకు ఆంధ్రా రెస్ట్ హౌస్ స్వాగతం పలుకుతోందని, కార్యదర్శి శ్రీ వై. శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రా రెస్ట్ హౌస్‌లో భోజన, వసతి కోరువారు తమ పేర్లు, చిరునామా తదితర వివరాలను వెంటనే నమోదు చేసుకోవల్సిందిగా కోరుతున్నారు. ఇందుకు ఆఖరు తేది 2026 జూన్ 30. మరిన్ని వివరాల కోసం కార్యదర్శి, మొబైల్ నంబర్ **99121 99978** సంప్రదించగలరు.

## మెహెర్‌బాబా పత్రిక కోసం

**మెహెర్‌బాబా పత్రిక నిర్వహణ కోసం 2026 మే / జూన్ నెలలలో**

1) శ్రీ మద్దినేని లక్ష్మీనారాయణ, ఆరేపల్లి ముప్పాళ్ళ, పల్నాడు జిల్లా రూ. 5000/-
2) శ్రీ ఇవటూరి వెంకట సన్యాసిరాజు, విశాఖపట్నం 1,000/-
3) **బాబా ప్రేమికులు తమ పేరు ప్రచురించవద్దని రూ. 1000/- పంపినారు. వీరందరికి పత్రిక పక్షాన ధన్యవాదములు, జైబాబా.**

సంపాదకీయం

# మౌనం - మహా త్యాగం

## మెహెరా మాయి జ్ఞాపకాలు

**ఆ వేళ 1925 జూన్ 26.**

**బాబా తాను జూలై 10 నుండి మౌనం పాటిస్తున్నట్లు ప్రకటించారు.** ఒక ఏడాది కాలం బాబా మౌనం పాటిస్తున్నారని 'కరపత్రాలు ద్వారా అందరికి తెలియజేశారు. జూలై 9న బాబా తన మండలితో సమావేశమయ్యారు. మెహెరాబాద్ కార్యకలాపాలను పర్యవేక్షిం చేందుకు ఐదుగురు మండలి సభ్యుల్ని నియమించారు. ఆ రోజు సాయంత్రం నాలుగైదు గంటల ప్రాంతంలో పోస్టాఫీసు భవనంలో వుంటున్న స్త్రీ మండలి దగ్గరకు వచ్చారు. "నేను రేపటి నుండి మౌనం పాటిస్తున్నాను. నా పని పూర్తవ్వగానే నా మౌన విరమణ చేస్తాను. మీ విధులను సక్రమంగా నిర్వర్తించండి. మీకు నేనిచ్చిన ఆదేశాలను తు.చ తప్పక పాటించండి. అది నన్నెంతో సంతోషపెడుతుంది. ఆశ్రమ బాలుర కోసం ప్రేమతో శ్రద్ధగా వంట చేయండి. వాళ్ళు పల్లెటూరు వాళ్ళని భావించ వద్దు. వాళ్ళు మీ పిల్లలనే భావంతో, శ్రద్ధగా వంట పని చేపట్టండని" బాబా హెచ్చరించారు.

**బాబా చేట్టిన మౌనం ఒక పక్షం లేదా నెల రోజుల పాటు ఉంటుందనుకున్నాం. ఆ పిదప,** ఎప్పటిలా మాట్లాడతారనుకున్నాం. **బాబా!** నీ మౌన విరమణ ఎప్పుడని మేం బాబాని ఒకటి రెండుసార్లు అడిగాం. ఒకరోజున "బాబా, నీ మధురమైన గొంతు వినాలని ఉంది. నీ గానం మళ్ళీ ఎప్పుడు వినగల్గుతాం అని, ఒక కాగితంపై రాసి బాబాకు అందజేశాం. మా లిఖిత వినతిని బాబా చదివారు. త్వరలో మాట్లాడతానని సంజ్ఞలతో జవాబిచ్చారు. తన పని పూర్తవ్వగానే మాట్లాడతానన్నారు. అందుకు తాను నిర్దేశించుకున్న సమయం రావాలన్నారు. ఆ పిదప, ఇలాంటి వినతులతో మేం బాబాని విసిగించ లేదు. మౌనంతో బాబా అనుభవించిన క్లేశం ఆయనకొక్కడికే తెలుసు.

**బాబావారి మాటలు ఎంతో మధురంగా ఉండేవి. మరెంతో మధురంగా భజన గీతాలు** పాడేవారు. పాటలో తాదాత్మ్యం చెందేవారు. పాటంటే ఆయనకు ఆరో ప్రాణం. బాబా సంగీతాన్ని ఎంతగానో ప్రేమించేవారు. ఈ విషయంలో ఆయనకు సాటి మరొకటి లేరు. ఐతే, మౌనం చేపట్టి బాబా తన మాటను త్యాగం చేశారు. తనకు తానుగా శిక్ష వేసుకున్నారు. యావత్తు మానవాళి ఆధ్యాత్మిక ఉన్నతి కోసం బాబా చేసిన గొప్ప త్యాగమిది. **బాబా మనల్ని అందర్నీ ఎంతగానో ప్రేమించారు. బాబా వారికి ఆనందం కలిగించేలా, మనం ఆయన్ని అధికాధికంగా ప్రేమించాలి. అదే మన నుండి బాబా కోరుకునేదని, మెహెరా మాయి ముగించారు. బాబావారి ఆదేశం మేరకు జూలై 10న మౌనం పాటించుదాం!**

# అవతార్ మెహెర్‌బాబా మౌనం
# జూలై 10



**మెహెర్‌బాబా ప్రేమికులందరికీ జూలై 10 చాలా పవిత్రమైన రోజు. 1925 జూలై 10** నుండి బాబా మౌనం ప్రారంభించారు. ఆ రోజున బాబా ప్రేమికులు వారెక్కడున్నా బాబా నామాన్ని స్మరిస్తూ మౌనం పాటిస్తారు. ఇది బాబా తన ప్రేమికులకు ఇచ్చిన ఆదేశం.

**గత కొన్నేళ్ళుగా చాలామంది బాబా ప్రేమికులు ప్రతి ఏడాది జూలై 10 నాటికి బాబా** సమక్షంలో గడిపేలా, బాబా సమాధి వున్న అహమ్మద్‌నగర్ జిల్లాలోని మెహెరాబాద్‌కు వెళ్తున్నారు. మెహెర్‌బాబా మౌనం పాటించే నాటికి ఆయన వయస్సు 31 సంవత్సరాలు. ఆ రోజుల్లో మెహెర్‌బాబా ఎదుటివారు సమ్మోహితులయ్యేలా చమత్కారంగా మాట్లాడేవారు. స్వయంగా ఢోలక్ వాయిస్తూ, అద్భుతంగా గజల్సు గానం చేశేవారు. అనర్గళంగా ఆయన చెప్పే అనేక ఆధ్యాత్మిక విషయాలు వినడానికి ఎందరో బాబా చుట్టూచేరి కూర్చుని శ్రద్ధగా ఆలకించేవారు.

**ఐతే, 1925వ సంవత్సరం తొలినాళ్ళ నుండి, బాబా తన సన్నిహితులతో త్వరలో తాను** మౌనం ప్రారంభించనున్నానని అనేకమార్లు ప్రకటించారు. బాబా చేసే ఈ ప్రకటనలోని మర్మం ఆయన శిష్యులకేమి బోధపడలేదు. ఒకసారి ఇలా బాబా తన మౌనం గురించి చెప్తుంటే, "బాబా నీవు మౌనం పాటిస్తే, నీవు నిత్యం చెప్తున్న అనేక ఆధ్యాత్మిక మర్మాలు ఎవరు చెప్తారు. దయచేసి మౌనం పాటించవద్దని" ఆయన శిష్యులు ప్రాధేయపడ్డారు. అందుకు "నేను బోధించుటకు రాలేదు. మేల్కొల్పుటకు వచ్చానని" "**I have Come not to teach - But to Awaken**". బాబా ప్రకటించారు.

**ఆ తర్వాత, ముందుగానే ప్రకటించినట్లు బాబా తన మౌనం 1925 జూలై 10న ప్రారంభించారు.** ఆనాటి నుండి సుమారు 44 సంవత్సరాలు, అంటే, బాబా తన భౌతిక శరీరం త్యాగం చేసే దాకా అంటే 1969 జనవరి 31 దాకా మౌనంలోనే వున్నారు. మౌనంగానే బాబా 13సార్లు విదేశీ ప్రయాణాలు చేశారు. మనదేశంలో ఆసేతు హిమాచలం సుమారు 72 వేల కిలో మీటర్లు ప్రయాణించారు. రవాణా వ్యవస్థ అంతంతమాత్రంగా వున్న

ఆ రోజుల్లో బాబా పలు సందర్భాలలో కాలినడకన, ఎద్దులబండ్లలో కూడా పర్యటించారు. 1940 నుండి ఓ దశాబ్దకాలం పైగా మస్తులనే భగవదోన్మత్తులతో సాంగత్యం కోసం అనేక మారుమూల ప్రదేశాలను సందర్శించారు. మౌనంలోనే మెహెర్‌బాబా భగవద్వచనం, సర్వం-శూన్యం, అనేక ప్రవచనాలు గ్రంథస్తం చేశారు. బాబా తన మౌనం గురించి పలు సందర్భాలలో ప్రస్తావిస్తూ, "నేనెప్పుడూ మౌనంగా లేను. నా ప్రేమికుల హృదయాంతరాలలో నిరంతరం మాట్లాడుతూనే వున్నానన్నారు". ఇది బాబా ప్రేమికులందరికీ నిత్యం అనుభవైక్యమే!

## రెండుసార్లు కారు ప్రమాదాలు

**1952 మే 24న అమెరికాలో మెహెర్‌బాబా కారులో ప్రయాణిస్తుండగా, ఒక్లహామా** ప్రాంతంలోని ప్రేగ్ నగర సమీపంలో ఘోర కారు ప్రమాదం జరిగింది. తిరిగి 1956 డిసెంబరు 2న పూణే నుండి కారులో తిరుగు ప్రయాణంలో వుండగా, సతారా పట్టణ సమీపంలో మరోసారి కారు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో బాబావారి కాలికి, తుంటికి ఫ్రాక్చరయింది. డాక్టర్లు శస్త్ర చికిత్స చేశారు. ఐతే, ఆ ఆపరేషన్ సమయంలో కూడా బాబా తన మౌనం విడనాడలేదు. అమితమైన బాధను మౌనంగా బాబా అనుభవించారని, అటు అమెరికాలో, అలాగే మనదేశంలోని అవతారునికి శస్త్ర చికిత్స చేసిన వైద్యులు వెల్లడించారు. సాధారణ మానవులు మౌనంగా ఇంతటి బాధను భరించలేరని డాక్టర్లు అభిప్రాయపడ్డారు. **1925 నుంచి 1954 దాకా అక్షరఫలకం సహాయంతో బాబా తన మౌనం కొనసాగించారు.** ఆపై అక్షరఫలకం కూడా వదలి, కేవలం సంజ్ఞలతో తన సందేశాలు ఇచ్చారు.

## బాబా మౌనం ఎందుకు చేపట్టారు?

**ఐతే, బాబా మౌనం ఎందుకు ప్రారంభించారు. ఎప్పుడు మౌన విరమణ చేస్తారు. ఇలా** బాబా మౌనంకు సంబంధించి ఎందరో అవతారుడినే నేరుగా ప్రశ్నించారు. బాబా యూరోపు, అమెరికా పర్యటనలలో వున్న సమయంలో, అలాగే భారత్‌లో కూడా ఎందరో పత్రికా విలేఖర్లు ఇదే విషయాన్ని గుచ్చి గుచ్చి ప్రశ్నించిన సందర్భాలు అనేకం వున్నాయి. **ఐతే అవతారుడు మౌనంగా ఏమాత్రం లేడని, పిలిస్తే పలుకుతాడని, ప్రతి క్షణం తమ** వెన్నంటి వున్నాడన్నది తమ నిత్యానుభవం అని, బాబా ప్రేమికులంటారు.

**చల్లపల్లి కేంద్రం-01.05.2026 శుక్రవారం పౌర్ణమి సందర్భంగా జరిగిన ప్రత్యేక సత్సంగ్ బాబా సెంటర్ నందు జరుపబడినది. 03.05.2026 ఉదయం 5:30 నుండి 7 వరకు ఏకనామం కార్యక్రమం కీ.శే. కొడపల్లి నాగ శాయి బాబు గారి కుటుంబసభ్యులచే మరియు కీ.శే. దిట్టకవి ముకుందరావు గారి కుటుంబ సభ్యులచే జరుపబడినది.**

పునర్ముద్రితం

# మౌన దీక్షలో పరీక్ష

**(శ్రీ బాలగోపాల భాస్కరరాజు)**

**తాడేపల్లిగూడెంలో ప్రతి ఏడాది మాదిరిగానే జూలై 10వ తేదీన మేమందరం మౌనంలో వున్నాం.** మా వూర్లోని శ్రీ పూసర్ల వెంకట నర్సయ్య అనే ఒక బాబా ప్రేమికుడు కూడా ఆనాడు మౌనంలో వున్నాడు. అతడు మౌనంలో వుండగా, అతని భార్య చనిపోయింది. బంధువులందరూ సమావేశమయ్యారు. మా వెంకట నర్సయ్య మౌనం వీడ లేదు. వచ్చిన వాళ్ళందరూ నర్సయ్యను యక్షప్రశ్నలతో వేధించారు. ధూషించారు. ఏమైనా, అతను మౌనం వీడలేదు. ఆమెకు అంత్యక్రియలు ఏర్పాటు చేశారు. స్మశాన వాటికకు వెళ్ళాడు కానీ అక్కడ కూడా మౌనంలోనే వున్నాడు. అతని వైఖరిని తప్పుపట్టనివారు లేరు. ఆ పిదప, ఈ సమాచారాన్ని బాబాకు తెలియజేశాను. బాబా వెంటనే వెంకట నరసయ్యకు టెలిగ్రాం ద్వారా ఆశీశ్సులు పంపించారు. ఆ టెలిగ్రాం నాకు రాత్రి 10 గంటలకు చేరింది. ఆ సమయంలో నేను, నా సహోద్యోగి శ్రీ వంగా వెంకట్రావు ఇద్దరం వెళ్ళి, నర్సయ్య గారికి టెలిగ్రాం చదివి వినిపించాం. బాబా ఆశీస్సులు అందుకున్న నర్సయ్య ధన్యుడు.



## శ్రీ ఆత్మకూరి సాంబశివరావు

**మచిలీపట్నం బాబా ప్రేమికులు శ్రీ ఆత్మకూరి సాంబశివరావు 2026** మే 27న బాబాలో ఐక్యమయ్యారు. చేయి తిరిగిన వంట మేస్త్రీగా పేరు గాంచిన సాంబశివరావు గత 40 ఏళ్ళుగా మెహెరాబాద్‌లో అమరతిథి, మౌన వార్షికోత్సవాలలో ఎందరికో బాబా ప్రేమ ప్రసాదం అందజేశారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కొన్ని క్షణాలు మౌనం పాటించామని తెలిపారు.

## శ్రీమతి యాద లక్ష్మి



బాబా ప్రేమికురాలు శ్రీమతి యాద లక్ష్మి 2026 మే 10వ తేదీన బాబాలో ఐక్యమయ్యారని స్థానిక బాబా ప్రేమికులు శ్రీ సత్తయ్య తెలిపారు. శ్రీమతి యాద లక్ష్మి నిరంతరం బాబా నామస్మరణలో గడిపిన ధన్యజీవి. మే 20వ తేదీన వారింట బాబావారి సత్సంగ్ ఏర్పాటు చేసి, స్థానిక బాబా ప్రేమికులు భజన గీతాలు ఆలాపించారు. ఆమె ఆత్మకు శాంతి కలగాలని బాబాని ప్రార్థిస్తూ కొన్ని క్షణాలు మౌనం పాటించామన్నారు.

# ఫ్రెడ్ మార్క్స్
## ఒక పాశ్చాత్య భక్తుని అంతరంగం



- **ఫ్రెడ్ మార్క్స్ బ్రిటీష్ దేశీయుడు.**
- బాబా ప్రేమ, సేవకు అంకితమైన ప్రేమికుడు.
- 1931లో పత్రికల ద్వారా బాబా సందేశాలను తెలుసుకున్నారు.
- ఆ సందేశాలలోని సత్యాన్ని గ్రహించిన ఫ్రెడ్, ఏసు ప్రభువే తిరిగి మెహెర్‌బాబాగా అవతరించారని బలంగా నమ్మారు.
- నాటి నుండి బాబా నామస్మరణతో ఎన్నో కార్యక్రమాలు నిర్వహించారు. ఎందరినో మెహెర్ పథంలోకి నడిపించారు.
- 17 సంవత్సరాల నిరీక్షణ తర్వాత మెహెర్‌బాబాని తొలిసారిగా దర్శించుకున్నారు.
- ఫ్రెడ్ నిష్కల్మషమైన ప్రేమకు ముగ్ధులైన మెహెర్‌బాబా, ఆయనను,
- **'మై ఫిషర్‌మాన్ ఇన్ ది వెస్ట్' (పాశ్చాత్య దేశాలలో నా జాలరి) అని ప్రశంసించారు.**
- బాబా ప్రేమికులు ఆయనను ప్రేమగా **'మెహెర్‌బాబాస్ గ్రాండ్ ఓల్డ్ మాన్ ఆఫ్ ఇంగ్లాండ్' అని పిలుచుకుంటారు.**
- లండన్ మహానగరంలో ఒక సాదాసీదా మనిషిగా జీవితాన్ని ప్రారంభించిన ఫ్రెడ్,
- అవతారుని అపార కరుణతో ఒక అసాధారణ ఆధ్యాత్మిక శిఖరంగా ఎదిగారు.
- **'బాబావారి మై విష్"** – ప్రతిరోజూ మూడుసార్లు పఠించమని ఫ్రెడ్‌ని ఆదేశించారు.
- బాబావారి ఆజ్ఞని తు.చ తప్పక శిరసావహించి, ఆచరణలో అమలు చేసిన ఫ్రెడ్ నేటి తరానికి మార్గదర్శకం.
- అవతారునికి అంకితమైన ఫ్రెడ్ లాంటి పాశ్చాత్య ప్రేమికుడొకరు, ఈ భూమి మీద నివసించాడంటే నమ్మశక్యం కాదంటారు...ఆయన సమకాలీనులు.
- కడదాకా బాబా ప్రేమ – సేవలో తరించిన ఫ్రెడ్ ధన్యుడు.
- **ఫ్రెడ్ మార్క్స్ గురించి మరిన్ని వివరాలు, ఇకపై ఆయన మాటల్లోనే క్లుప్తంగా, సమగ్రంగా లోపలి పేజీల్లో పే. 10 నుండి చదువుకుందాం...**

***

# ఫ్రెడ్ మార్క్స్

## మెహెర్‌బాబాస్ గ్రాండ్ ఓల్డ్ మాన్ ఆఫ్ ఇంగ్లాండ్ (1900 - 1985)

**'నేను ఇంగ్లాండు దేశస్థుడిని. లండన్ మహానగర నివాసిని. నా పేరు ఫ్రెడ్ మార్క్స్.** 1900 జనవరి 6న లండన్‌కు సమీపంలోని నాటింగ్ హామ్ అనే ప్రాంతంలో ఒక నిరుపేద క్రైస్తవ కుటుంబంలో జన్మించాను. మాది ముగ్గురు మగ పిల్లల కుటుంబం, అందులో నేను నడిమివాడిని. మా నాన్నగారు ఫర్నిచర్ పాలిష్ పని చేసేవారు. నా బాల్యం ఎంతో సాదాసీదాగా గడిచింది. నేను అప్పుడప్పుడే లోకాన్ని చూస్తున్న తరుణంలో, మొదటి ప్రపంచ యుద్ధం (1914 -1918) ముంచుకొచ్చింది. ప్రభుత్వం నుండి వచ్చిన ఆదేశాల మేరకు, 18 సంవత్సరాల వయస్సులో నేను బ్రిటీష్ సైన్యంలోని 'గార్డ్స్ రెజిమెంట్' లో చేరాల్సి వచ్చింది. 1919 ఆగస్టులో యుద్ధం ముగిసిన ఒక ఏడాది తర్వాత నేను సైన్యం నుండి డిశ్చార్జ్ అయ్యాను. కానీ, ఆ యుద్ధ భూమిలో జరిగిన దారుణాలు, మనుషుల నడుమ ఉన్న స్వార్థం, క్రూరత్వం నా మనస్సుని తీవ్రంగా కలచి వేశాయి. లక్షలాది మంది క్షతగాత్రులు, అపార ప్రాణ నష్టాన్ని కళ్లారా చూశాను. దాంతో ఈ లౌకిక జీవితంపై నాకు విరక్తి కలిగింది. మనుషులపై నమ్మకం సన్నగిల్లింది. జీవిత పరమార్థం ఏమిటో తెలుసుకోవాలనే తీవ్రమైన అన్వేషణ నన్ను 'దైవచింతన' వైపు నడిపించింది. యుద్ధం ముగిసిన తర్వాత కొంతకాలం స్కూల్ టీచర్‌గా పనిచేశాను. ఆ తర్వాత పాతకాలపు అరుదైన వస్తువుల వ్యాపారంలో **"యాంటిక్ డీలర్"** గా లండన్‌లో స్థిరపడ్డాను.

## మధుర జ్ఞాపకాలు

**అది 1931వ సంవత్సరం, సెప్టెంబరు నెల. మెహెర్‌బాబా లండన్ పర్యటనకు వచ్చారు. బాబావారి** పర్యటన గురించి అప్పట్లో స్థానిక దినపత్రికలు ప్రముఖంగా ప్రచురించాయి. ముఖ్యంగా, **'డైలీ ఎక్స్ ప్రెస్'** అనే పత్రిక బాబావారితో జరిపిన ఇంటర్వ్యూని పతాక శీర్షికతో ప్రచురించింది. ఆ శీర్షికని ఆసాంతం చదివాక, నేను బాబావారి దైవత్వం పట్ల ప్రగాఢంగా ఆకర్షితుడినయ్యాను. నా ఆరాధ్య దైవమైన ఏసు ప్రభువే మెహెర్‌బాబాగా తిరిగి వచ్చాడని నా అంతరంగంలో బలమైన నమ్మకం కుదిరింది. ఇలా మూడు, నాలుగు సంవత్సరాలు గడిచాయి. **అంటే 1935 నాటికి, నా ఆరాధ్య దైవం ఏసు ప్రభువు - మెహెర్‌బాబా ఒక్కరేనన్న గట్టి నమ్మకం ఏర్పడింది. ఇందుకు తగిన కారణం లేకపోలేదు.**

## "అన్నీ వదిలి నా వద్దకు రా"

**ఆ రోజు 1935 జూన్ 15. ఉదయం 9 గంటల ప్రాంతంలో 'అన్నీ వదిలి నా వద్దకు రమ్మనమని'** ఒక పిలుపు నా చెవులలో స్పష్టంగా వినపడింది. ఇది నా భ్రమ కాదు, కల ఏ మాత్రం కాదు. ఎంతో స్పష్టంగా ఆ మాటలు నా చెవులను తాకాయి. ఈ మాటల్ని నా 'గురువు గారి' ప్రత్యక్ష ఆదేశంగా భావించాను. ఆ క్షణం నుండే దేవుని కోసం మాత్రమే జీవించాలని, నిస్వార్థసేవతో, నిరాడంబరంగా నా జీవితాన్ని గడపాలని గట్టిగా నిర్ణయించుకున్నాను. అదీ ఎలా జరిగిందో చెప్తాను.

## 1935 – 1945 మధ్య కాలం...

**రెండవ ప్రపంచ యుద్ధ వాతావరణం యావత్తు యూరోప్‌ని అలుముకుంది. అది చాలా** గడ్డుకాలం. ఆ సమయంలో లండన్‌లోని ఆక్స్‌ఫర్డ్ వీధిలో ఒక షాపుని అద్దెకు తీసుకుని నా యాంటిక్ వ్యాపారాన్ని కొనసాగిస్తున్నాను. దాదాపు ఈ సమయంలోనే **శ్రీమతి మాడమే పోలి** అనే ఆవిడతో నాకు పరిచయమయింది. ఆమె కూడా నా షాపుకి దగ్గర్లోనే యాంటిక్ వ్యాపారం చేస్తుండేది. ఒకరోజు ఉదయం ఆమె ఎంతో ఆశ్చర్యంతో నాతో ఒక విషయం చెప్పింది. ఉదయం 9 గంటలకు ఆమె షాపు ఓపెన్ చేస్తుంటే, ఎదురుగా ఉన్న ఫుట్‌పాత్‌పై క్రీస్తు నడుస్తున్నట్లు ఆమెకు కనిపించిందట. మొదట ఆమె తన కళ్ళను తాను నమ్మలేక పోయానని, కళ్ళు తుడుచుకుని తేరిపార చూసినా నిజంగానే ఏసు ప్రభువు అక్కడ కనిపించారని ఎంతో భక్తితో నాతో చెప్పింది. క్రమేణా ఈమెతో నా స్నేహం మరింత బలపడింది. ఆ స్నేహం ద్వారా నాకు మెహెర్‌బాబా గురించి మరింత లోతుగా తెలుసుకునే అవకాశం చిక్కింది. **అదెలా అంటే...**

**శ్రీమతి మాడమే పోలి షాపులోనే శ్రీమతి మేరీ, విల్ బ్రాకెట్ అనే దంపతులతో నాకు** పరిచమయ్యింది. వీరిద్దరూ గొప్ప బాబా ప్రేమికులు. 1933లో బాబా లండన్ పర్యటనలో ఉన్నప్పుడు మెహెర్‌బాబా వీరి ఇంటిని సందర్శించారు. ఈ దంపతులు 1930వ దశకంలో నాసిక్ ఆశ్రమంలో కొన్నాళ్ళు వున్నారు. ఆ తర్వాత లండన్‌కు తిరిగి వచ్చారు. లండన్ నుండి సుమారు 30 కిలోమీటర్ల దూరంలో ఉన్న **'కెంట్' అనే ప్రాంతంలో "మెహెర్‌బాబా స్పిరిచ్యువల్ లీగ్"** పేరిట ఇంగ్లీషు బాబా ప్రేమికుల కోసం ఒక సంస్థను నెలకొల్పారు. వీరి ఇంట్లో ప్రతి గురువారం బాబా సత్సంగ్ కార్యక్రమాలు జరిగేవి. నేను ప్రతివారం ఆ కార్యక్రమాలకు హాజరయ్యేవాడిని. అక్కడే నాకు డాక్టర్ విలియం డాంకిన్, డేలియా డిలియాన్ వంటి మరికొంతమంది బాబా ప్రేమికులతో పరిచయం ఏర్పడింది. శ్రీమతి మేరీ, విల్ బ్రాకెట్ దంపతులిద్దరూ బాబావారి ప్రేమకు ప్రతీకలుగా నిలుస్తారు. ఎందరికో

**ఆతిథ్యమిచ్చే గొప్ప మనసున్న వారు. వీరి ద్వారా మా అందరికీ మెహెరాబాద్ సమాచారం** ఎప్పటికప్పుడు తెలిసేది. అహమ్మద్‌నగర్ వార్తలు, సర్క్యులర్లు బాబా మండలి ముందుగా వీరికి పంపేవారు. 1940-1950 సంవత్సరాల నడుమ వీరి అందమైన, విశాలమైన బంగళాలో బాబా నామస్మరణతో ప్రతిధ్వనించేది; బాబా ప్రేమికుల సవ్వడితో కళకళ లాడుతుండేది. ఇక్కడ సత్సంగ్ కార్యక్రమాలలో పాల్గొనడం ద్వారా నాకు ఎన్నో దివ్యాను భూతులు కలిగాయి. అంతేకాదు, బాబాపట్ల నమ్మకం, ప్రేమ మరింత ఇనుమడించాయి. బాబావారిని త్వరలోనే దర్శించుకోవాలని నా మనసు పరితపించేది. కానీ, ఆ అవకాశం కనుచూపు మేరలో ఎక్కడా కనపడలేదు. నేను బాబాను చూడకపోయినప్పటికి, బాబా సందేశాలను పదిమందికి చెప్పడం ప్రారంభించాను. ఆ సమయంలో బాబా నాతో భౌతికంగా వున్నారనిపించేది. నేను చేస్తున్న ప్రతి బాబా పనిలో బాబా సహాయపడుతున్నా రనిపించింది. అలా బాబావారి ప్రేమ నాకు లభిస్తుంటే, బాబా కార్యక్రమాలను మరింత ఉత్సాహంగా నేను చేసేవాడిని. నేను క్రైస్తవుడిని కదా. మిగిలిన ఐదు మతాలు ఒక్కటేనన్న భావం నాలో అంతర్లీనంగా ఉండేది. అటువంటి సమయంలో, తీవ్ర ఎండా కాలంలో చల్లని మేఘంలా ఒకరోజు బాబా ప్రేమికురాలు శ్రీమతి జీన్ అడ్రియల్ అమెరికా నుండి లండన్‌కు వచ్చింది. ఆమె ద్వారా బాబా నా కోసం ఒక ప్రత్యేక బహుమతిగా ఒక చిన్న పుస్తకాన్ని పంపారు. ఆ పుస్తకం పేరు **'గాడ్ కాలింగ్'.** నిజంగా దేవుని పిలుపు అందుకున్నంత ఆనందం ఆ పుస్తకం చదువుతుంటే లభించింది. నా మనస్సుకు చాలా ఊరట చిక్కింది.

## ఉత్తరాలు రాసే అవకాశం

**ఆ గ్రంథంలోని తొలి పేజీలో ఉన్న మాటలు ఇలా ఉన్నాయి: "నీ ప్రతిమాటా నాకు వినిపిస్తుంది. ఏ చిన్న శబ్దం నా దృష్టిని దాటలేదు. నా ఇచ్ఛ ప్రకారం నడుచుకో. నీ బాధ్యత నేను చూసుకుంటాను",** అంటూ బాబా భరోసా పలికారు. ఆ పుస్తకంలోని ప్రతి పదం నన్ను ఉద్దేశించి రాసినట్లే అనిపించింది. **ఆ దరిమిలా, 1940వ దశకం ప్రారంభంలో బాబా ప్రేమికులు మెహెరాజాద్‌కు నేరుగా ఉత్తరాలు రాసే** అవకాశం ఇచ్చారు బాబా. ఈ మేరకు మెహెరాజాద్ నుండి ఒక సర్క్యులర్ వచ్చింది. దాంతో, నా మనస్సులోకి వచ్చిన సందేహాలను ఉటంకిస్తూ బాబాకు నేరుగా ఉత్తరాలు రాసేవాడిని. బాబా కూడా తన కార్యదర్శి ద్వారా తగిన సమయంలో నాకు జవాబులు పంపేవారు. ఇలా చాలాకాలం గడిచింది. ఒక లేఖలో బాబా ఇలా అన్నారు. "నిస్వార్థంగా తోటివారి క్షేమం కోసం నీవు ఏ పనిని చేపట్టినా దాన్ని నేను అనుమతిస్తున్నానని అన్నారు. ఇంకా ఎన్నో విషయాలు ప్రస్తావిస్తూ, పసికందు తల్లి ప్రేమ కోసం తల్లడిల్లినట్లు, దేవుని ప్రేమ కోసం పరితపించడమే

నిజమైన దైవీప్రేమ అని బాబా గుర్తుచేశారు. **ఒకటిన్నర దశాబ్దానికి పైగా కాలం గడిచింది. ఆ పిదప, ఒక రోజున ఏమైందో తెలుసాండి?**

## 17 సంవత్సరాల నిరీక్షణ తర్వాత... బాబా దర్శనం!

1952 ఆగస్టులో మెహెర్‌బాబా లండన్‌కు వస్తున్నట్లు ముందుగా సమాచారం వచ్చింది. ఆ మాటలను నేను మొదట నమ్మలేక పోయాను. 'కలయా... వైష్ణవ మాయా?' అనిపించింది. భగవంతుణ్ణి భౌతికంగా దర్శించే భాగ్యం నాకు లభిస్తుందని ఏనాడూ ఊహించ లేదు. నా ఆనందానికి అవధులు లేవు. 1935 నుండి అంటే, సుమారు 17 సంవత్సరాల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత బాబా దర్శనం లభిస్తుందన్న వార్త నన్ను ఉక్కిరిబిక్కిరి చేసింది.

**1952 జూలై ఆఖరి వారంలో బాబా న్యూయార్క్ నుండి లండన్‌కు చేరుకున్నారు. ఆ ఏడాది** మే 24న ఓక్లహోమాలోని 'ప్రేగ్' దగ్గర బాబా ప్రయాణిస్తున్న కారు ఘోర ప్రమాదానికి గురైన సంగతి పాఠకులకు తెలుసు. ఆ ప్రమాదం జరిగిన కేవలం రెండు నెలలకు, భారతదేశానికి తిరిగి వెళ్తూ బాబా లండన్ వచ్చారు. అంతటి ప్రమాద బాధలో ఉండి కూడా, ఆయన లండన్‌లో ఎందరికో దర్శనమిచ్చారు. లండన్‌లోని **'చారింగ్ క్రాస్ హోటల్'లో** బాబావారి బస ఏర్పాటు చేశారు. ఆ హోటల్‌లోనే నేను మెహెర్‌బాబాను తొలిసారిగా దర్శించుకున్నాను. ఆ సమయంలో నాకేమనిపించిందంటే... 'బాబా ఎదుట మూర్ఖులకు నోటమాట రాదు; జ్ఞానులు మౌనంగా, స్థాణువులై అచేతనులవుతారని పించింది. బాబా నన్ను తనకు దగ్గరగా వచ్చి కూర్చోమన్నారు. నా చేతులను తన చేతుల్లోకి ప్రేమగా తీసుకున్నారు. బాబా ముఖం ఎంతో ప్రకాశవంతంగా వెలిగిపోతోంది. **బాబా నాతో, "నేను అన్నింటా, అందరిలో ఉన్నాను. నా ప్రేమతో నీకు సహాయం చేస్తాను",** అంటూ ప్రేమగా ఆలింగనం చేసుకున్నారు. బాబా కౌగిలిలో నన్ను నేను మర్చిపోయాను. నా హృదయంలోని ఆ యుద్ధపు గాయాలన్నీ మాయమైపోయాయి. ఒక అద్భుతమైన దైవిక ప్రశాంతత నా మనసును నింపింది. నా తండ్రి ఒడికి చేరానన్న తృప్తి కలిగింది.

## మెహెరాబాద్‌లో మూడు వారాలు

**ఆ తర్వాత, 1954** సెప్టెంబరులో **మూడు వారాలు** మెహెరాబాద్‌లో **బాబా సమక్షంలో** గడిపేందుకు లండన్ నుంచి ముగ్గురు ప్రేమికులకు బాబా ఆహ్వానం పంపారు. ఆ ముగ్గురిలో నేనూ ఉన్నాను. నాతో పాటు చార్లెస్ పర్డమ్, విల్ బ్రాకెట్‌లకు ఆ ఆహ్వానం అందింది. నేను భారతదేశాన్ని సందర్శించడం ఇదే ప్రథమం; అదీ బాబావారి పిలుపుపై

రావడం నా అదృష్టం. నేను ఓడలో బొంబాయికి బయలుదేరాను. ఆశ్చర్యకరంగా, నేను నా క్యాబిన్‌లోకి వెళ్లేసరికి బాబా ఫోటోలు నా సీటుపై అందంగా సర్ది ఉన్నాయి! అంతేకాదు, అమెరికాలోని న్యూయార్క్ నుంచి వస్తున్న బాబా ప్రేమికుడు శ్రీ దానా ఫీల్డ్‌కు కూడా నా క్యాబిన్‌లోనే బర్త్ కేటాయించారు. ఆ ప్రయాణంలో దానా ఫీల్డ్ బాబా గురించి ఎన్నో కబుర్లు చెప్పాడు. అవన్నీ తిరిగి వివరించడం నా వల్ల కాదు. అలా మా సముద్ర యానం ఎంతో సుఖంగా సాగింది. మెహెర్‌బాబా సెప్టెంబరు 12న అహమ్మద్‌నగర్‌లోని 'వాడియా పార్కు'లో ప్రజా దర్శనం ఇచ్చారు. ఆనాడు కొన్ని వేల మంది బాబాని దర్శించు కున్నారు. క్యూ వేగంగా ముందుకు కదిలే ఏర్పాట్లు చేశారు. బాబా స్వయంగా ప్రతిఒక్కరికీ తన చేతులతో ప్రసాదం అందించారు. ఆ రోజు 10 వేల మందికి భోజన వసతి ఏర్పాటు చేశారు. బాబా దర్శనార్థులతో కలిసి నేలపై కూర్చుని సహపంక్తి భోజనం చేశారు.

## ఇక్కడ ఒక విషయం చెప్పాలి...

**"నేను బాబాకు చాలా దగ్గరగా, ఆయన ఆసనం వెనుక నిలబడ్డాను. బాబా నాకు ఒక చిన్న** బాధ్యత అప్పగించారు. అదేమిటంటే, బాబావారు కూర్చున్న ఆసనం వెనుక ఒక మెత్తని తలగడ ఏర్పాటు చేశారు. ఆ దిండు కదిలినప్పుడల్లా దాన్ని యథాస్థానంలో పెట్టడమే నా పని. బాబా ముందుకు వంగి భక్తులకు ప్రసాదం ఇచ్చినప్పుడల్లా ఆ దిండు జరిగిపోయేది. నేను దాన్ని సరిచేస్తూ ఉండేవాడిని. ఇలా సాయంత్రం 6 గంటల మునిచీకటి వేళ వరకు బాబా దర్శనం, ప్రసాద వితరణ నిరంతరాయంగా కొనసాగాయి. కొన్ని వేల మందికి ప్రసాదం పంచినా బాబాలో ఎక్కడా అలసట కనిపించలేదు; మెరుపు వేగంతో ప్రసాదం ఇచ్చారు. అయితే, మరుసటి రోజు నా చేయి నా స్వాధీనంలో లేదు! నేను చేసిన ఆ చిన్న పనికే నా కుడిచేయి విపరీతంగా నొప్పి పుట్టింది. మరి కొన్ని వేల మందికి స్వయంగా ప్రసాదం పంచిన ఆ అవతారుడు ఇంకెంత శారీరక బాధను అనుభవించి ఉంటాడో కదా అనిపించింది!

## నా జాలరివి..

**సెప్టెంబరు 15న బాబా మమ్మల్ని విడివిడిగా కలిశారు. నా వంతు వచ్చినప్పుడు బాబా** నాతో ఇలా అన్నారు: "నేను పురాణ పురుషుడను. నేనెవరో నీకు తెలుసు. క్రీస్తు కాలంలో మాదిరిగానే, "నేను **నా జాలర్లను నా చెంతకు (I am drawing My Fishermen) ఆకర్షిస్తున్నాను.** సద్గురువుకు, శిష్యునికి మధ్య ఆధ్యాత్మిక–భౌతిక లోకాలను అనుసంధానించేందుకే నా జాలర్లను నా దగ్గరకు చేర్చుకుంటున్నాను" అని బాబా అన్నారు. సెప్టెంబరు 20న బాబా, మండలి సభ్యులతో కలిసి మేము ఉపాసనీ మహారాజ్ ఆశ్రమం (సకోరి)

వెళ్లాం. అక్కడ ఉపాసనీ సమాధికి ప్రణమిల్లాం. నేను ఆరడుగుల బురుజులా ఉంటాను కదా! ఎంతగా తల వంచి లోపలికి వెళ్లినా, ఆ సింహద్వారం దగ్గర నా నుదిటికి గట్టి దెబ్బ తగిలింది. అది చూసి బాబా నా నుదిటిని నిమిరి, ప్రేమగా ఓదార్చి, ఒక చిన్న బ్యాండేజి వేశారు. ఆనాడు బాబాతో నా అనుభూతి మాటల్లో వర్ణించలేనిది. బాబా ఆ రోజు ఎన్నో దివ్య సందేశాలు ఇచ్చారు; ముఖ్యంగా 'సంస్కారాల ఏర్పాటు, వాటి నిర్మూలన' గురించి ఎంతో స్పష్టంగా వివరించారు. ఆ రోజు సకోరి నుండి తిరిగి వస్తూ కొద్దిసేపు 'రాహూరి'లో ఆగాం. అందరినీ ఆశ్చర్యపరిచేలా, ఆ రోజు ఉదయం నా నుదిటికి తగిలిన గాయం ఇప్పుడు ఎలా ఉందని, ప్రేమావతారుడు నన్ను మళ్లీ అడిగారు.

## భావి సమాధి దర్శనం

**సెప్టెంబరు 26న అహమ్మద్‌నగర్‌లోని 'ఖుస్రూ క్వార్టర్స్' ప్రాంగణంలో బాబా ప్రజా దర్శనం** ఇచ్చారు. ఆ సమయంలో లండన్ నుంచి వెళ్లిన మా అందరినీ ఆయన ప్రత్యేకంగా, విడివిడిగా కలిశారు. ప్రేమతో ఆలింగనం ఇచ్చారు. సెప్టెంబరు 30. ఆ వేళ మా మూడు వారాల ఆధ్యాత్మిక యాత్ర ముగిసే రోజు. ఆనాడు బాబా స్వయంగా ముందుండి మమ్మల్ని 'ఎగువ మెహెరాబాద్'కు తీసుకెళ్లారు. అక్కడ గజదొంగ 'సత్యమాంగ్' జీవితంలో వచ్చిన పరివర్తన గురించి వివరించారు. ఆ తర్వాత మమ్మల్ని దగ్గరుండి తన భావి సమాధి వద్దకు తీసుకువెళ్లారు. మా బృందంలోని ఒక

## ఓ అమెరికన్ అంతరంగం

**మెహెరాబాద్‌లో మూడు వారాల మహా సహవాస్ చివరి రోజున బాబా మా అందరికి ఒక్కొక్కరికి ఒక కమలా పండు ఇచ్చారు. గ్రీసు దేశం నుంచి వచ్చిన ప్రేమికుడొకరు ఆ పండు తొక్క తీసి, ప్రక్కన పడేశాడు. పండుని కడుపారా ఆరగించాడు.**

**ఫ్రెడ్ ఏం చేసాడనుకున్నారు !**
**అలా క్రింద పడేసిన తొక్కని**
**తన జేబులో పెట్టుకున్నాడు.**
**బధ్రంగా దాచిపెట్టాడు.**
**లండన్ తిరిగి వెళ్ళాక కూడా**
**ఫ్రెడ్ ఆ తొక్కని బధ్రంగా**
**తన వద్ద వుంచాడు.**
**ఇదంతా**
**ఒక అమెరికన్ ప్రేమికుడొకరు**
**గమనిస్తూనే వున్నాడు.**

***

**సుమారు 15 సంవత్సరాల తర్వాత**
**ఆ గ్రీస్ ప్రేమికుడు తాను పడేసిన**
**తొక్కని గుర్తుచేస్తూ,**
**తిరిగి తనకివ్వమని ఫ్రెడ్‌ని అడిగితే,**
**ఎలాంటి సంకోచం లేకుండా**
**ఫ్రెడ్ అతగానికి తిరిగి ఇచ్చాడు.**

***

**ఇదీ ఫ్రెడ్‌కి బాబా ఎడల గల ప్రేమ, భక్తి అని, ఆ అమెరికన్ ప్రేమికుడు ఫ్రెడ్ గురించి సున్నితంగా చెప్పాడు.**

***

ఆరుగురిని సమాధి లోపలికి తీసుకెళ్లారు; అందులో ముగ్గురం ఒకవైపు, మరో ముగ్గురం ఇంకోవైపు నిలబడగా, బాబా మాకు ఎదురుగా తలవైపు నిలిచారు. బాబావారి దివ్య సమక్షంలో, సమాధి లోపల మేం కొన్ని క్షణాలు మౌనంగా బాబా నామస్మరణ చేశాం. ఆ తర్వాత సమాధికి ఆరుబయట గ్రూప్ ఫోటో కోసం బాబా స్వయంగా మమ్మల్ని పిలిచారు. అది ముగిశాక, దగ్గర్లోని ఒక చెట్టు కింద మరో గ్రూప్ ఫోటో తీయించుకున్నాం. ఆనాటి ఆ మధుర క్షణాలు నా జీవితంలో ఎన్నటికీ మరచిపోలేనివి.

## అంతర్యామి... ఆత్మీయత!

**నేను తొలిసారిగా బాబాని 'వాడియా పార్కు'లో దర్శించుకున్నప్పుడు, "ఈ భూమిపై నడుస్తున్న సాక్షాత్తు దేవదేవుణ్ణి దర్శించుకుంటున్నాను" అనే తీవ్ర భావోద్వేగ అనుభూతికి లోనయ్యాను**. ఆనాడు బాబా చుట్టూ ఉన్న వేలాది మంది జనం మధ్య నన్ను ఆయన గమనించే అవకాశం లేదేమో అనుకున్నాను. పశ్చిమ దేశాల నుంచి వచ్చిన 17 మంది ప్రతినిధులలో నేనూ ఒకడిని. అయితే, నా మనసులో మరో ఆలోచన కూడా మెదిలింది, బాబా అంతర్యామి, ఆయనకు మాలో ప్రతి ఒక్కరి గురించి సంపూర్ణంగా తెలుసు, కాబట్టి నా గురించీ బాబాకు అవగతమే అయి ఉంటుందనుకున్నాను. నేను ఇలాంటి డోలాయమాన స్థితిలో ఉండగానే, బాబా నన్ను లోపలికి రమ్మంటున్నారని కబురు వచ్చింది. బాబా నన్ను చూస్తూనే ఎలాంటి ప్రశ్నలూ అడగకుండా, 'నేనెవరో నీకు తెలుసు" అన్నారు. తాను పురాణ పురుషుడినని, తన జాలర్లను (శిష్యులను) తన చెంతకు పిలుచుకుంటున్నానని చెబుతూ, "నీవు నాకు బాగా దగ్గరవాడివి; దేని గురించీ చింతించకు, ధైర్యంగా ముందుకు సాగు" అని భరోసా ఇచ్చారు.

**అంతేకాదు, "బాబా నన్ను నిర్లక్ష్యం చేస్తున్నారు, పట్టించు కోవడం లేదు"** అని ఎప్పుడూ భావించవద్దని నా మనసులోని శంకను దూరం చేస్తూ హితవు పలికారు. ఆ తర్వాత, నేను వంగి బాబాకు ప్రణమిల్లబోతుంటే, ఆయన నా చుబుకాన్ని తన చేతుల్లోకి ప్రేమగా తీసుకున్నారు.(ముఖ చిత్రాన్ని చూడగలరు). ఆ క్షణంలో "నన్ను ఇంకా అధికంగా ప్రేమించు" అని బాబా చెప్తున్నట్లు నా కనిపించింది. ఇక్కడ ఒక గమ్మత్తైన విషయం చెప్పాలి. ఆ దరిమిలా నాలాగా ఆరడుగుల పొడవాటి వాళ్ళు ఎవరైనా బాబా దర్శనానికి వస్తే, "ఆలింగనం అందుకోవడానికి మీ మోకాళ్లపై బాగా వంగి నా వద్దకు రండి" అని బాబా నవ్వుతూ హెచ్చరించేవారు.

**అలా రెండేళ్లు గిర్రున తిరిగాయి. ఆ తర్వాత, 1958 మేలో అమెరికాలోని మెర్టిల్‌బీచ్‌లో ఒక ప్రత్యేక** 'సహవాస్' కార్యక్రమం ఏర్పాటు చేశారు. అందులో పాల్గొనే భాగ్యం నాకు

కూడా దక్కింది. లండన్ నుంచి నాతో పాటు చాలామంది బ్రిటిష్ బాబా ప్రేమికులు దానికి హాజరయ్యారు. అప్పటికే (1956 డిసెంబరు 2న) సతారాలో బాబాకు రెండవసారి కారు ప్రమాదం జరిగింది.

## బాబావారి ఆన

**ఆ సహవాస్‌లో బాబా ఎన్నో ముఖ్యమైన సందేశాలు ఇచ్చారు. నా కోసం ఒక ప్రత్యేక సందేశాన్ని ఇవ్వవలసిందిగా బాబాను కోరాను. అందుకు, "ప్రతిరోజూ మూడుసార్లు "మై విష్" (నా వాంఛితము) అనే ప్రార్థనను పఠించమని ఆదేశించారు. ఆనాటి నుండి నేను బాబా ఇచ్చ ప్రకారమే నడుచుకుంటున్నాను.** ఆ తర్వాత, 1962 నవంబరులో పూణేలో ఏర్పాటు చేసిన 'తూర్పు-పడమర దేశాల మహా సమావేశాలలో' **(East-West Gathering)** పాల్గొన్నాను . బాబా ఆదేశానుసారం ఈ సమావేశాలకు అందరికంటే ముందే నేను పూణే చేరుకున్నాను. కార్యక్రమాలన్నీ ముగిసి అందరూ వెళ్ళిపోయిన తర్వాత, ఆఖరిగా నేను పూణే నుండి లండన్‌కు బయలుదేరాను. ఈ సమావేశాలలో నాకు లభించిన గొప్ప అనుభూతి ఏమంటే, బాబా కేవలం ఒక గురువు మాత్రమే కాదు, ఆయనే ఈ జగద్రక్షకుడు అనే అనుభూతి కలిగింది. ఈ సమావేశాల్లోనే, ఒకరోజున బాబాను ఇలా అడిగాను. **"ప్రేమ అనేది ఏదైనా ఒక రూపానికి పరిమితమా? లేక అది రూపానికి అతీతమైనదా?'** అని అడిగాను. బాబా తన రెండు చేతులనూ గాల్లోకి ఎత్తి, మౌనంగా **"అనంతం"** అని జవాబిచ్చారు. బాబానే నా చేత ఈ ప్రశ్న అడిగించారనిపిస్తుంది నేటికీ.

## బిగిన్ ద బిగైన్...

**'బిగిన్ ద బిగైన్' (Begin the Beguine) అనే వెస్ట్రన్ సాంగ్ అంటే మెహెర్‌బాబాకు** అత్యంత ఇష్టం. ఈ పాట "భగవంతుడు మానవజాతికి పంపిన ప్రేమ లేఖ" అనేది నా అభిప్రాయం. 1969లో బాబా భౌతిక దేహాన్ని వదిలిపెట్టినప్పుడు, ఈ పాటను ప్లే చేయాలని బాబా తన మండలిని ముందుగానే ఆదేశించిన సంగతి పాఠకులకు తెలుసు. ఈ పాటకు ప్రముఖ స్వరకర్త 'కోల్ పోర్టర్' 1935లో సంగీతం సమకూర్చగా, 'లెస్లీ హచిన్సన్' ఆలపించారు. 1930వ దశకానికి చెందిన ఈ పాట రికార్డులు దొరకడం లేదు. అయితే, ఈ పాటకు చెందిన ఒరిజినల్ గ్రామోఫోన్ రికార్డు **(78 RPM Record)** ఎక్కడ ఉన్నా సరే వెతికి పట్టుకుని, మెహెరాజాద్‌కు పంపాలని (1960లో) బాబావారి ఆదేశంగా మణిజా నాకు ఒక లేఖ రాసింది. దాంతో నేను లండన్‌లోని ప్రముఖ మ్యూజిక్ షాపులు, సంగీతాభిమానులు, ఇలా వారూ – వీరూ అనకుండా ప్రతి చిన్న దుకాణంలోనూ జల్లెడ పట్టి, చిట్టచివరకు ఆ అరుదైన రికార్డును వెతికి సాధించాను. ఆ తర్వాత లండన్

నుండి మెహెరాజాద్‌కి వెళ్తున్న ఒక బాబా ప్రేమికురాలి ద్వారా దానిని భద్రంగా బాబాకు అందజేశాను. ఈ రికార్డు అందిన వెంటనే బాబా దీనిని పలుమార్లు ప్లే చేయించుకుని విన్నారని తెలుపుతూ, బాబా సోదరి 'మణిజా' నాకు ప్రత్యేకంగా ఒక లేఖ రాశారు.

## బాబాతో నా అనుభవాలు...

**బాబాతో నా అనుభవాలను, అనుభూతులను భావి తరాల కోసం గ్రంథస్థం చేయమని** బాబా మండలి నన్ను పలుమార్లు కోరింది. అయితే, "నా వ్యక్తిగత అనుభవాలకు అంతటి ప్రాముఖ్యత ఉంటుందా?" అని భావించి చాలాకాలం వాయిదా వేశాను. చివరకు, నా డైరీల ఆధారంగా ఒక చిత్తుప్రతిని రూపొందించి, 1979 జనవరిలో 'అవేకనర్ మేగజైన్' ఎడిటర్‌కు పంపాను. కానీ, ఏ కారణంవల్లనో ఆ గ్రంథం వెలుగు చూడలేదు.

## నిరాడంబర తాత్వికుడు

**ఫ్రెడ్ మార్చ్ జీవితం మనకు నిరూపించేది ఏమంటే, దైవాన్ని చేరుకోవడానికి** హిమాలయాలకు వెళ్లక్కర్లేదు, పెద్ద పెద్ద శాస్త్రాలు చదవక్కర్లేదు. లండన్ వీధుల్లో ఒక సాదాసీదా యాంటిక్ డీలర్‌గా ఉంటూనే, మెహెరుడి హృదయంలో సుస్థిరస్థానం సంపాదించుకున్నాడని ఫ్రెడ్‌ని ఒక నిరాడంబర తాత్వికుడిగా ఆయన సమకాలీనులు ప్రేమిస్తారు. ఫ్రెడ్ అవివాహితుడు. పెళ్ళి చేసుకోలేదు. బాబా సేవకు - ప్రేమకు ప్రతీక ఫ్రెడ్ నిలుస్తాడు. 'వినమ్రతకు' చిరునామా ఫ్రెడ్ అని, ఫ్రెడ్ లాంటి బాబా ప్రేమికుడొకరు ఈ భూమ్మీద వున్నాడంటే భవిష్యత్తరాల వారు నమ్మబోరేమోనని, ఆయన సమకాలీన పాశ్చాత్యులు కొనియాడతారు.

**"మెహెర్‌బాబాస్ గ్రాండ్ ఓల్డ్ మాన్ ఆఫ్ ఇంగ్లాండ్"గా పలువురి ఆదరాభిమానాలు** అందుకున్న ఫ్రెడ్ మహాశయుడు లండన్‌లోని రాయల్ హోమియోపతి ఆసుపత్రిలో 1985 మార్చి 2న, తన 85వ ఏట బాబాలో ఐక్యమయ్యారు. **యుగావతారుని మనస్సు దోచుకున్న ఫ్రెడ్ మార్చ్ ధన్యుడు. ఈ తరం వారందరికీ ఫ్రెడ్ మార్చ్ ప్రాతఃస్మరణీయుడు.**

## 399 పేజీల గ్రంథం

**సుమారు అర్ధ శతాబ్దం తర్వాత, ఫ్రెడ్ రాసుకున్న డైరీల ఆధారంగా, 2023లో బాబా** ప్రేమికుడైన **సూ చాప్మన్** "ఫ్రెడ్ మార్చ్ - బాబాస్ గ్రాండ్ ఓల్డ్ మాన్ ఆఫ్ ఇంగ్లాండ్" పేరిట 399 పేజీల ఒక బృహత్ గ్రంథాన్ని ప్రచురించారు. **ఫ్రెడ్ గురించి మరింత సమాచారం తెలుసుకోవాలనుకునే వారందరూ ఈ పుస్తకాన్ని తప్పక చదవవల్సింది.**

**- జైబాబా**

# వర్ని బాబా కేంద్ర 23వ వార్షికోత్సవం

**2026 జూన్ 14వ తేది**



**నిజామాబాద్‌కి సమీపంలో వున్న వర్ని బాబా కేంద్ర 23వ వార్షికోత్సవం 2026 జూన్ 14న** వైభవంగా జరిగిందని కార్యదర్శి శ్రీ గోవిందరావు ఒక ప్రకటనలో తెలిపారు. బాబా ప్రేమికులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ముందుగా సప్తవర్ణపతాకావిష్కరణ, ధుని ప్రజ్వలన, అనంతరం ప్రేమిక సహవాస్ నిర్వహించడమైంది. సహవాస్‌లో బాబావారి సందేశాలపై శ్రీ బి. రామక్రిష్ణయ్య, శ్రీ ఎ. జనార్థన్ రావు, శ్రీ ఉమామహేశ్వర సింగ్, ప్రసంగించారు. శ్రీ అల్లూరి శ్రీనివాసరావు 'సత్యాన్వేషణ' అనే అంశంపై ఏకపాత్రాభినయం చేశారు. కాగా, శ్రీ ఆర్. రామచందర్, శ్రీ జి. సత్తయ్య, శ్రీ పిడుగు అప్పారావ్, శ్రీ మల్లిక్ బృందం, తదితరులు బాబావారి భక్తి గీతాలను హృద్యంగా ఆలాపించారు. వర్ని కేంద్ర ప్రేమికులు శ్రీ అనిమిరెడ్డి, శ్రీ చిన్నారి, శ్రీ నాగరాజు, తదితరులు సహవాస్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. చివరిగా బాబా ప్రార్థనలు, ఆరతితో సహవాస్ కార్యక్రమం ఘనంగా ముగిసింది.



# మెహెరీశం

**అవతార్ మెహెర్‌బాబా జీవితచరిత్ర**

**ఆంగ్ల మూలం:- భావూ కల్చూరీ**

**లార్డ్ మెహెర్, 1925 నుండి**

**తెలుగుసేత: *మల్లాది రామారావ్, మెహెరాబాద్***

**(గత సంచిక తరువాయి)**

**ఈ నా లీల అనాదిగా జరుగుతోందన్నారు. యుగావతారుడిగా అమితానందం తమ** సొత్తు అన్నారు. ఇందువల్లనే విశ్రాంతికి కొదవవుండదన్నారు తమకి. అనంత విశ్రాంతి దొరుకుతుందన్నారు. మానవాళి ఆధ్యాత్మికోన్నతికి నిరంతర కృషి చేస్తుంటాను. ఇందు కోసమే కదా అవతరించింది. ముక్తి వో పట్టాన దొరకదు మనిషికి. ఆధ్యాత్మికంగా పైకి త్రోయాలి నేను. ఇదేమీ ఆషామాషీ పనికాదు. వొళ్ళు హూనం అవుతుంది. ఇందాక చెప్పానే అమితానందం నా సొత్తు అని గుర్తుందా మీకు. ఈ అమితానంద స్థితి వల్ల వో లాభం వుంది నాకు. నా విశ్వకార్యక్రమం వల్ల కలిగే శ్రమ అంతా యింతా కాదు కదా! ఆ శ్రమ కొంచెం తగ్గుతుంది అమితానంద స్థితి వల్ల అని చెప్తూ, బాబావారు వో మాట అన్నారు. అనంత ఆనందానికీ అతీతుడిని. అలానే విశ్వకార్యక్రమపు శ్రమకీ అతీతుడిని. ఇదొక జగన్నాటకం అన్నారు.

**దివ్యానుభూతి ఐదేళ్ళప్పుడే లభించిందన్నారు. అది ఎలా జరిగిందో వివరించారు.** చెప్పానుగా నాకు ఐదేళ్ళు. ఒక రోజున పెద్ద వెలుతురు కనిపించింది. కళ్ళు మిరుమిట్లు గొల్పింది. రకరకాల రంగుల్లో మెరిసి పోయిందా కాంతి. ఆ వెలుతురులో ఏమి కనిపించిందో తెలుసా? లెక్కల్లో చెప్తారే వృత్తాల గురించి, గుర్తుందా మీకు. ఆ వృత్తాలు కన్పించాయి. వొకటా రెండా? ఎన్నో కనిపించాయి. ఎక్కడ ఆ బ్రహ్మాండమైన వెలుతురులో. ఈ వృత్తాల్లోనూ మరెన్నో వృత్తాలు. అబ్బురపడ్డాను. అభం శుభం తెలియని వయస్సు కదా నాది. కళ్ళు తిరిగి పడిపోయాను. అది అప్పటి సంగతి. కళ్ళ ముందు తళుక్కున మెరిసిన ఆ దివ్యానుభూతి నాసొంతం ఇప్పుడు రోజల్లా.

**ఈ సృష్టి యావత్తూ నాలో నుంచి పుడుతున్నాయని నాకు తెలుసు. ఈ ఎరిక ఐదేళ్లప్పుడు** లేదు. ఇప్పుడు వుంది. సృష్టి ఒకసారితో ఆగిపోదు. మళ్ళీమళ్ళీ చేయాల్సి వస్తుంది సృష్టి. ఇదొక నిరంతర ప్రక్రియ. ఈ సంగతులన్ని నా పుస్తకంలో అదే నా రహస్య గ్రంథంలో

చాలా వివరంగా వ్రాశాను. ఆ పుస్తకం వెలుగులోకి రాగానే శాస్త్రవేత్తలు కూడా ఔరా అంటారు. సృష్టి రహస్యాలు ఎన్నో సాధికారంగా, వాళ్ళ ముందుకు వస్తాయి. కనువిప్పు కల్గిస్తాయి శాస్త్రవేత్తలకి. నేను వ్రాసిన ప్రతి సంగతీ– అదే మన శాస్త్రవేత్తలకి తెలియని సృష్టి మర్మాలను గాలి కబుర్లు కాదు, హేతుబద్ధకమైన వాదనలు వినిపించాను ప్రతి కొత్త విషయానికీ. ఇందువల్లనే నా రహస్య గ్రంథం భావితరాలకి బైబిల్ వంటిది. బైబిల్ అంటున్నది ఇది ఏదో మత గ్రంథం అనుకొంటున్నారేమో. అలాంటిది ఏమీ లేదు. మరి బైబిల్‌తో ఎందుకు పోల్చాను? ఎందుకు పోల్చానంటే, బైబిల్ ఎంతగా ప్రభావితం చేసిందో మానవాళిని మీకు తెలుసు. బైబిల్ మాదిరిగా ప్రజల నోట నానుతుంది. అన్ని మతాల వారికి కరదీపిక నా పుస్తకం అన్నారు. సాహితీ పరంగా కాకపోవచ్చు కానీ అన్నారు. ఈ పుస్తకాన్ని ఆసాంతం కాకపోయినా కొన్ని పేజీలు చదివిన అదృష్టవంతుడు గాంధీ గారు. అది 1931 నాటి మాట. ఇంకా వెలుగు చూడలేదు ఆ పుస్తకం. యుగావతారుని బైబిల్ వెలుగు చూసేదెప్పుడో? ఇదొక చిదంబర రహస్యం.

**మనం మళ్ళీ లుగానోకి వస్తే, మే 6వ తేదీన పారమౌంట్ వారి వార్తా వాహిని చర్చకు** వచ్చింది. ఆ వేళ అందరూ వో సినిమా చూసి వచ్చారు కిమ్‌కో గదిలో కూర్చొన్నారు. మీరు పారమౌంట్ వాళ్ళకిచ్చిన ఇంటర్వ్యూకి మంచి స్పందన లభించిందన్నారు వొకరు. లండన్ పత్రికలన్నీ ఆకాశానికి ఎత్తేసాయన్నారు ఇంకొకరు. ఒకే దారంతో చేసిన పూల గుత్తి అన్న శీర్షికతో వచ్చిన కథనాన్ని చదివారు మరొకరు. ఇంతలో వచ్చింది వార్త. ఫ్రాన్స్ రాష్ట్రపతి పాల్ డౌమర్‌ని హత్య చేశారట. పాలెల్ గౌర్‌గోల్ చంపాడట. నిందితుడు రష్యన్ కమ్యూనిష్టు. ఈ వార్త వింటూనే బాబావారు గుంభనమైన వాఖ్య చేశారు. నా ప్రతినిధులు కదుపుతున్నారు పావుల్ని వేగంగా అన్నారు. యుద్ధ సూచనలు కనిపిస్తున్నాయన్నారు వొకరు. వెంటనే చర్చ యుద్ధం పైకి మళ్ళింది. రక్తం ఏరులై ప్రవహిస్తుందన్నారు బాబావారు. వచ్చే యుద్ధం భయానకంగా వుంటుందని భవిష్యవాణి చెప్పారు. సామూహిక మారణకాండ జరగవచ్చు. ఆ ప్రమాదం తప్పించాలీ అంటే వొక్కటే మార్గం. మారణకాండ పేరు చెప్పి జనబాహుళ్యం పడే బాధలకి కొంగు పట్టాలి నేను. అలాచేస్తే రోగాలపాలవు తాను. కృంగి, కృశించి పోతానన్నారు. ఒక్కమాటలో చెప్పాలంటే ఆ ప్రపంచ భారంతో నిర్వీర్యుడనవుతామన్నారు. తమ విశ్వ కార్యక్రమ పర్యవసానమూ ఇంతే, ఇలాగే వుంటుంది. శారీరకంగా నన్ను కృంగదీస్తుంది అన్నారు. ఈ మాటలు వింటూనే కళ్ళ నీళ్ళ పర్యంతమయ్యారు శిష్యులు. ఈ మధ్య బాబావారు శారీరకంగా బాధపడుతున్నారని వాళ్లకి తెలుసు. బొంబాయిలో బయలుదేరినప్పటి నుంచీ కడుపు నెప్పి విపరీతంగా వస్తోంది. కొత్తగా చర్మవ్యాధి పట్టుకొంది. బాబావారి శారీరక బాధలు, చైనా – జపాన్‌ల పోరు ఒకేసారి మొదలయ్యాయి. తమ కళ్ళ ముందే ప్రభువు బాధపడుతుంటే ఏమి

చేయాలో పాలుపోలేదు ఆదీ, కాకా, కిమ్‌కో ప్రభుతులకు. మనమూ కొంత భారం మనపై వేసుకొంటేనో అన్న ఆలోచన వచ్చింది కిమ్‌కీ, మింటాకి. వెంటనే మనసులో మాట నివేదించారు ప్రభువుకి. వాళ్ళ అభ్యర్ధనని బాబావారు కొట్టి వేశారు. తామొక్కరే భరించగలరట. ఇంకెవరి తరమూ కాదని స్పష్టం చేశారు. నేనే అనుభవించాలీ బాధల్ని. లేకపోతే ఏమౌతుందో తెలుసా? ఇంతై, వటుడింతైనట్లు తారాస్థాయికి చేరుకొంటాయి ఈ బాధలు. ఈ  భూ ప్రపంచంలో ఎవ్వరూ భరించలేరు ఆ నరక యాతన అని అన్నారు. బాబావారి మాటలకి శిష్యులు నిశ్చేష్టులయ్యారు. ఇదేమి పరీక్ష బాబా మాకు అనుకొన్నారు. ఇది పరీక్ష కాదు. ఇదొక శిక్షణ. ఎటువంటి పరిస్థితుల్లోనూ తలవంచని ధీరోదాత్తులుగా వారిని తీర్చిదిద్దుతున్నారు బాబా.

**మే 7వ తేదీన బాబావారు తమ భవిష్యత్ కార్యక్రమాన్ని సూచనప్రాయంగా చెప్పారు.** **ఈ** విశ్వ కార్యక్రమపు బాధల్ని మూడురకాలుగా భరిస్తామన్నారు. ఈ బాధలో కొంత నాపైనే వేసుకొంటాను. తమ గురించి చేసే తప్పుడు ప్రచారం, వక్రీకరిస్తూ రాసే రాతల వల్ల కొంత బాధలు తుడిచిపెట్టుకు పోతాయి, అక్కడక్కడ వచ్చే చిన్న యుద్ధాల తోటి, హింసాత్మక భావ విస్పోటనలతోటి మిగిలిన బాధలకి స్వస్తి పలుకుతామన్నారు. ఈ మాటలు వింటూనే ప్రేమికలోకం కొంత వూపిరి తీసుకొన్నారు. బాబావారిది విశ్వాత్మకమైన మనసు అని తెలుసుకానీ, యావత్తు మానవాళి బాధల భారం బాబావారిపైనే పడుతుందన్న సంగతి తెలియదు వారికి. బాబావారికి ఎంత దగ్గరగా వుంటున్నామనుకొంటున్నారో, అంతకంటే ఎక్కువ దూరంగా వున్నామన్న వైనం తెలీదు వాళ్ళకి పాపం. అందుకనే కిమ్‌కో సూచనకి ప్రభువు చిరునవ్వు నవ్వారు. మానవాళి భారంలో కొంత వ్యతిరేక ప్రచారంతో సరిపెట్టుకొంటామన్నారు కదా. కాస్తంత బదులు, అధిక భాగాన్నే వ్యతిరేక ప్రచారానికీ, వక్రీకర వ్యాఖ్యలకీ బలి చేస్తే? భలే బాగుంటుం దనుకొంది కిమ్‌కో. మనసులో మాట పైకి చెప్పింది. తప్పుడు ప్రచారంతో కొట్టుకు పోగా మిగిలిన బాధల బరువుని వదిలించు కోవడం పెద్ద కష్టం కాదనిపించింది ఆమెకి. ఇందుకు బాబావారు ఏమి చేయాలి? మీ మీద వేసుకోకు బాబా ఆ భారాన్ని. ఏదో వొక రకంగా తుడిచిపెట్టు దాన్ని అన్నది. ఇక్కడ లుగానోలో ఈ చర్చజరుగుతుంటే, అక్కడ లండన్‌లో బాబా వ్యతిరేక ప్రచారం వూపు అందుకొంటోంది. వక్ర రాతలు తారస్థాయికి చేరుతున్నాయి. కొంత విమర్శ, మరికొంత వ్యతిరేకత వుంటేనే కదా దైవభక్తి పెరిగేది. ప్రేమ వరదలై ప్రవహించేది. ఇందుకు రంగం సిద్ధం చేస్తున్నారు మెహెరుడు. కిమ్‌కో సూచనలకి  స్పందించనిది ఇందుకనే.

**– సశేషం**

# జూలై 10న మౌనం తప్పక పాటించాలా?

**"ప్రతి సంవత్సరం జూలై 10న మౌనం తప్పక పాటించాలా? ఈ ప్రశ్నకు, బాబా మండలి సభ్యుడు ఏరుచ్ జెస్సావాలా ఇచ్చిన జవాబును ఈ వ్యాసంలో చాలా వివరంగా తెలియ జేశారు. ఇకపై ఏరుచ్ మాటల్లోనే చదువుకుందాం!"**

**మెహెర్‌బాబా 44 సంవత్సరాలు కఠిన మౌనంలో ఉన్నారు. బాబా చేపట్టిన మౌనం గురించి,** అలాగే, బాబావారి మౌన విరమణ గురించి మనం తరచు మాట్లాడుకుంటూ ఉంటాం. చాలామంది బాబా ప్రేమికులు 'జూలై 10వ తేదీన ప్రత్యేకంగా మౌన దినం పాటించాలా? వద్దా?" అని అడుగుతుంటారు. ఐతే, మౌనంగా వుండాలా? వద్దా అనే అంశం వారి వారి వ్యక్తిగత నిర్ణయం అన్నారు ఏరుచ్. మనం జరుపుకుంటున్న పెద్ద పండుగలు – దీపావళి, ఉగాది, కొత్త సంవత్సరం వేడుకల మాదిరిగానే, యావత్తు ప్రపంచంలో జూలై 10న మౌన దినం పాటించేరోజు అతి త్వరలోనే వస్తుంది. జూలై 10న మనం మౌనం పాటించాలా? వద్దా? అనే దానికి మెహెర్‌బాబానే మనకు చాలా స్పష్టంగా కొన్ని సూచనలు ఇచ్చారు.

## తొలినాళ్ళలో

**ప్రారంభంలో మేం ఎన్నడూ మౌన దినాన్ని ఓ ప్రత్యేకమైన రోజుగా జరపలేదు. ఒక రోజున** బాబా మౌనం ప్రారంభించిన జూలై 10వ తేదీని **ఒక బాబా** ప్రేమికుడు గుర్తుచేశాడు. ఆ రోజున ఉపవాసం పాటించమని బాబా సూచించారు. ఆ మేరకు బాబా కార్యదర్శి అయిన ఆదీ.కె.ఇరానీ ద్వారా ఒక సర్క్యులర్‌లను విడుదల చేయాలని బాబా ఆదేశించారు. ఉపవాస సమయంలో కేవలం టీ మాత్రమే త్రాగవచ్చని, 24 గంటల పాటు ఉపవాసం వుండాలని బాబా సూచించారు.

**ఆ పిదప, మరో ప్రత్యామ్నాయంగా "24 గంటలు ఉపవాసం ఉండగల్గిన వారు ఉండండి, లేదా, 24 గంటలు మౌనం పాటించమని"** బాబా ఆదేశించారు. ఇందుకు చాలామంది బాబా ప్రేమికులు, తాము మౌనం పాటిస్తామని ఆనందంగా చెప్పారు. ఉపవాసం కంటే మౌనం సుళువని వారు భావించినట్లుంది. అప్పట్నుండి చాలామంది బాబా ప్రేమికులు జూలై 10న మౌనం పాటిస్తున్నారు. ఇకపోతే **"మౌనమా? ఉపవాసమా?"** ఈ రెండింటి నడుమ డోలాయమానంలో ఉన్నవాళ్ళు బాబాతో తమ సాధకబాధకాలు చెప్పుకుంటూ ఇలా అన్నారు. **"బాబా! మేం ఉద్యోగాలలో ఉండటం వల్ల మౌనం సాధ్యపడడం లేదు"** అని వాపోయారు. మౌనం వల్ల ఎదురౌతున్న ఇబ్బందుల చిట్టాను బాబా ఎదుట విప్పారు.

కొంతమందికి మౌనం పాటించడం కష్టమైతే, మరికొంతమంది తమ ఆరోగ్య కారణాల రీత్యా ఉపవాసం చేయడం కష్టం అని చెప్పుకొచ్చారు.

## నా వాంఛితము

**అందుకు చిరునవ్వుతో అందరికీ బాబా జవాబిచ్చారు. "మీరందరూ జూలై 10వ** తేదీన తప్పక మౌనం లేదా ఉపవాసం పాటించాలని నేను కోరుకుంటున్నానని" ప్రకటించారు". బాబా మండలి సభ్యులు కూడా ఈ ఆదేశాలను తప్పక పాటించాలని స్పష్టం చేశారు. ఇది తన కోరిక (వాంఛితము) అని అన్నారు బాబా. దాంతో బాబా ప్రేమికులు వారు ప్రపంచంలో ఎక్కడున్నా ప్రతి సంవత్సరం జూలై 10వ తేదీన మౌనం లేదా ఉపవాసం పాటిస్తూ వస్తున్నారు.

**కాగా, 1960 దశకం చివరిలో జూలై 10వ తేదీ మౌన వార్షికోత్సవం పాటించడం గురించి** బాబా చాలా వివరంగా ఇలా చెప్పారు. "ఎన్నో సంవత్సరాలుగా నేను మౌనం పాటిస్తున్నాను. ఈ క్రమంలో నా ప్రేమికులందరూ ఏడాదిలో ఒకరోజున మౌనం పాటించాలి. ఇందులో ఎవరికీ ఎలాంటి మినహాయింపు లేదు" అని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. ఆ మాదిరిగా, నేడు మనమందరం మౌనదినం పాటిస్తున్నాం. ఇది మెహెర్‌బాబా తన ప్రేమికులకు ఇచ్చిన ఒక అద్భుతమైన బహుమతి. "బాబా భౌతికంగా మన మధ్యలో ఉన్న రోజుల్లో కూడా ఆయన సమక్షంలో మేం మౌనం పాటించాం", అని ఏరుచ్ తన వివరణ ముగించారు.

**ఆ దరిమిలా, 'జూలై 10వ తేదీన, నా ప్రేమికులందరూ తప్పక మౌనం పాటించండి. ఉపవాసం అవసరం లేదు, అని స్పష్టమైన తుది ఆదేశాలు ఇచ్చారు. అదీ సంగతి!**

**2026 జూలై 10వ తేది, బుధవారం నాడు, అవతారుని ఆదేశాల మేరకు, బాబా ప్రేమికులు అందరూ మౌనం పాటించడానికి సిద్ధంగా వుందాం!**

---



## శ్రీమతి మేళ్ళచెరువు పుష్పావతి

శ్రీమతి మేళ్ళచెరువు పుష్పావతి, నరసరావుపేట 2026 మే 23న స్వల్ప అస్వస్థతతో బాబాలో ఐక్యమయ్యారని స్థానిక బాబా ప్రేమికులు ఒక ప్రకటనలో తెలిపారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని మౌనం పాటించామని శ్రీ వంకాయల అచ్యుతరావు తెలిపారు.

# విశ్వకళ్యాణం కోసం

## 1930వ దశకంలో బాబావారి సోదరి మణిజా చెప్పిన మాటలివి



**బాబా కొంతకాలం ఉపవాసం, ఏకాంతవాసం ఉండబోతున్నానని ప్రకటించారు.** ఈ విషయం తెలిసిన తల్లి శిరీన్ మాయి తల్లడిల్లిపోయింది. తన కొడుకుతో ప్రేమగా ఇలా అన్నది:

"ఎందుకురా నాయనా! ఎందుకు ఇలాంటి పనులు చేస్తున్నావు? నీకు భగవంతుడు చక్కని గొంతు ఇచ్చాడు. నీ మాటలు వింటుంటేనే మత్తు మందు చల్లినట్లు ఉంటుంది. నీ గాత్రం ఎంతో మధురంగా ఉంటుంది. మౌనంతో నీ చక్కని గొంతును కఠినంగా శిక్షిస్తున్నావని బాధపడుతుంది.

**ఇదిలా ఉండగా, కొత్తగా ఉపవాసం, ఏకాంతవాసం అంటూ మరింత శిక్ష నీకు నీవుగా** విధించుకుంటున్నావు. అసలే బక్కపలచగా ఉన్నావు. ఇంకా పాడైపోతావురా నాయనా" అని తల్లి శిరీన్ వాపోతుంది. "ఇదంతా నీకోసం కాదంటున్నావు, ఇదంతా నీ చుట్టూ ఉన్న ఈ పిల్లల కోసమేనని కదా నీవు చెబుతున్నావు. కాబట్టి వారందరినీ ఉపవాసం, మౌనం పాటించమను, నీవు విశ్రాంతి తీసుకో అని" సలహా ఇచ్చింది.

**తల్లి హృదయం కదా, కొడుకు తనకు తాను శిక్ష వేసుకుంటున్నాడని తెగ బాధపడింది. ఇందుకు బాబా: "అమ్మా! యావత్ ప్రపంచంలో ఉన్న మానవాళి వారి జీవితకాలమంతా మౌనంగా ఉన్నా, ఉపవాసం ఉన్నా, నేను ఒక్క రోజు ఉపవాసం, మౌనం పాటించిన దానితో సమానం కాదు. కాబట్టి నా విశ్వ కార్యక్రమం గురించి నీవు బాధపడవద్దు" అని తల్లిని సున్నితంగా సముదాయించారని మణిజా ఒక సందర్భంలో పేర్కొన్నారు. బాబా చేపట్టిన మౌనం, ఏకాంతవాసం విశ్వకల్యాణం కోసమేనని మణిజా వివరించారు.**

---



**శ్రీమతి కె. అమ్మాజి, రామచంద్రాపురం 10.6.2026వ తేదీన** స్వల్ప అస్వస్థతతో అవతారునిలో ఐక్యమయ్యారని స్థానిక బాబా ప్రేమికులు ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీమతి అమ్మాజి బాబావారి నామస్మరణతో గడిపేవారని, బాబా కార్యక్రమాలలో చురుకుగా పాల్గొనేవారు. ఆమె ఆత్మకు శాంతి కలగాలని బాబాని మౌనంగా ప్రార్థించినట్లు తెలిపారు.

# లైఫ్ సర్క్యులర్ నంబరు 39
# 1958 జూలై 10న మౌనం పాటించవద్దు

- **1958 జూన్ 18న, లైఫ్ సర్క్యులర్ నంబరు 39 విడుదల చేశారు.**
- **1958 జూలై 10వ తేదీన బాబా ప్రేమికుల్ని మౌనం పాటించవద్దని ఆదేశించారు.**
- **ఆ రోజున మెహెరాబాద్‌లో ప్రత్యేక ప్రేమిక సహవాస్‌ను ఏర్పాటు చేశారు.**
- **ఆ సహవాస్‌కి కేవలం 200 మంది ప్రేమికుల్ని ప్రత్యేకంగా ఆహ్వానించారు.**
- **ఈ సహవాస్ వేదికగా బాబా విశ్వ సందేశం ప్రకటించారు.**
- **ఈ అవతారకాలంలో ఇదే తన ఆఖరి సందేశం అన్నారు బాబా.**
- **ఈ యుగంలో తమదే ఆఖరి అవతారం అని బాబా ప్రకటించారు.**
- **ఈ సమయంలోనే మెహెర్‌స్థాన్ నిర్మాణానికి శ్రీ కోదూరుని బాబా అనుమతించారు. అత్యంత ముఖ్యమైన ఆ సమాచారం క్లుప్తంగా ఈ శీర్షికలో తెలుసుకుందాం!**

***

**జీవిత సర్క్యులర్ నంబరు 39ని, 1958 జూన్ 18వ తేదీన విడుదల చేశారు.** ఆ సర్క్యులర్ ద్వారా బాబా తన ప్రేమికులెవరూ **ప్రతి సంవత్సరం మాదిరిగా 1958 జూలై 10న మౌనం గానీ, ఉపవాసం గానీ పాటించవద్దని ఆదేశించారు.** అలాగే, ప్రత్యేకంగా ఎంపిక చేసిన సుమారు 200 మంది బాబా ప్రేమికులను జూలై 10న మౌన వార్షికోత్సవానికి మెహెరాబాద్‌కు హాజరుకావల్సిందిగా బాబావారి కార్యదర్శి శ్రీ ఆది కె. ఇరానీ, జూన్ 20న ఆహ్వానాలను పోస్టు చేశారు. వీరిలో 8 మంది మహిళలు కూడా వున్నారు. ఈ సహవాస్‌కి ఇతర మహిళలు ఎవరినీ అనుమతించ లేదు. ఆహ్వానితులు మెహెరాబాద్‌కు జూలై 9కల్లా చేరుకోవాలని కోరారు. జూలై 10న మెహెర్‌బాబా తన విశ్వ సందేశం ప్రకటించనున్నారని పేర్కొన్నారు.

**1958 జూలై 10వ తేదీన బాబా ప్రేమికులు మౌనం, ఉపవాసం పాటించవద్దని జీవిత** సర్క్యులర్‌లో పేర్కొంటూ ఆ రోజున ఈ క్రింది కార్యక్రమాన్ని నిర్వహించమని ఆదేశించారు. అదేమంటే, 1958 జూలై 9 నాడు అర్ధరాత్రి సరిగ్గా 12 గంటలకు ఈ క్రింది పదాలను ఇంగ్లీషులో గాని లేదా ఆయా ప్రాంతీయ భాషల్లో గాని బిగ్గరగా ఏడుసార్లు పఠించమన్నారు.

**Beloved God, Thy WILL has come to pass.**

**ప్రియతమ దైవమా! నీ ఇచ్ఛ నెరవేరుతుంది !**

## మెహెరాబాద్‌లో

**1958 జూలై 9, బుధవారం, నాటికి ఆహ్వానిత బాబా ప్రేమికులలో 180 మంది** మెహెరాబాద్‌కు చేరుకున్నారు. ఈ ప్రత్యేక సమావేశంలో బరోడా మహారాణి శాంతాదేవి, కురుద్‌వాడ్ మహారాజు, మహారాణులు, భోర్ మహారాజు తదితరులు మెహెరాబాద్‌కు విచ్చేశారు. తెలుగువారిలో శ్రీ కోడూరి కృష్ణారావు, శ్రీ టి.కుటుంబ శాస్త్రి, డాక్టర్ తోట ధనపతిరావు నాయుడు తదితరులు హాజరయ్యారు. ఈ సమయంలోనే ఆంధ్రాలో మెహెర్‌స్థాన్ నిర్మాణం చేపట్టడానికి శ్రీ కోడూరుని బాబా అనుమతించారు. ఆధ్యాత్మిక చింతనాపరులందరికీ మెహెర్‌స్థాన్ విశ్వమందిరంగా భాసిల్లాలన్నారు బాబా.

**మెహెర్‌బాబా మెహెరాబాద్‌కు జూలై 9 మధ్యాహ్నానికల్లా విచ్చేశారు. ముందుగా, అందరి** యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ రాత్రికి పెందలకడనే పడుకుని, తెల్లవారుతూనే ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొనమన్నారు. ఆ రోజు రాత్రికి 1954లో బాబా వారి ఆంధ్రా పర్యటన, 1956లో అమెరికా యాత్రలో భాగంగా చిత్రీకరించిన చలనచిత్రాలను మెహెరాబాద్‌లో ప్రదర్శించారు. అర్ధరాత్రి 12 గంటలకు బాబా ఇచ్చిన సందేశాన్ని ఆకాశానికి చిల్లుపడేలా బిగ్గరగా ఏడుసార్లు పఠిస్తూ ధుని వెలిగించారు. ఆనాడు రాత్రి స్థానికంగా నెలకొన్న తీవ్ర దుర్భిక్షాన్ని దూరం చేసేలా విశేషంగా పెద్ద ఎత్తున వాన కురిసింది.

**ఆ మర్నాడు జూలై 10, గురువారం ఉదయాన్నే 7 గంటలకు బాబా మెహెరాజాద్ నుండి** కారులో మెహెరాబాద్‌కు వచ్చారు. ముందుగా, మండలివారితో సుమారు గంటసేపు సమావేశమయ్యారు. అనంతరం, విచ్చేసిన ప్రేమికులతో బాబా ముచ్చటించారు. ప్రేమికులు బాబాకు పూలదండలు వేశారు. భజనగీతాలు ఆలాపించారు. కేశవనారాయణ్ నిగం తాను ప్రచురించిన 'పుకార్' హిందీ మాస పత్రిక రెండు ప్రతులను బాబాకు అందజేశాడు. ఆ తర్వాత ఆనాటి ప్రత్యేక సమావేశం యొక్క ప్రత్యేకతను బాబా వివరించారు. శ్రీ కుటుంబ శాస్త్రి బాబావారి మాటలను తెలుగులో అనువదించారు. అలా అనువదిస్తుంటే మధ్యలో బాబా ఆయనను ఆపి, నాపేరు ప్రక్కన ప్రతిసారి 'గారు' అంటున్నారేమని ప్రశ్నించారు. బాబా 'గారు' అంటే బాబా 'జీ' అని అర్థమని క్లుప్తంగా జవాబిచ్చారు శ్రీ తాడిమేటి. ఆ దరిమిలా బాబా ఎదుట ప్రార్థనలు, ఆరతి నిర్వహించారు. శ్రీ కుటుంబ శాస్త్రి తెలుగులో ప్రార్థనలు చదివారు. ఆ పిదప, బాబా ప్రసంగిస్తూ, తాను ఈ రోజున తన చిట్టచివరి, ఆఖరి సందేశాన్ని ఇస్తున్నట్లు ప్రకటించారు. అవతారుడు ఇస్తున్న ఆఖరి సందేశాన్ని ఆయన సమక్షంలోనే ఆలకిస్తున్న మీరందరూ ఎంతో అదృష్టవంతులని సహవాసీలను బాబా కొనియాడారు. ఇకపై నా నుండి మీకు ఎలాంటి

**సందేశాలు, ప్రవచనాలు ఉండవన్నారు. ఇదే కడపటిదని పేర్కొన్నారు. ఇక్కడ** నా ఈ అఖరి సందేశాన్ని విన్న మీరందరూ, తిరిగి మీ ప్రాంతాలకు వెళ్ళి ఇక్కడ జరిగిన ప్రతి విషయాన్ని అక్కడున్న వారికి తెలియజెప్పండన్నారు. ఈ విశ్వ సందేశాన్ని ప్రతి ఒక్కరికీ తెలియజేసేలా విస్తృత చర్యలు చేపట్టమన్నారు. బాబాను భగవంతునిగా ఆరాధించేవారికి, ప్రేమించేవారికి, బాబాను నమ్మనివారికి, అందరికీ విశ్వ సందేశాన్ని తెలియజేయమన్నారు. ఇది విశ్వవ్యాపిత సందేశం. విశ్వంలో ప్రతి ఒక్కరికీ చెందినదీ సందేశం అని బాబా అన్నారు. ఈ రోజు ఉదయం 9 గంటల తర్వాత మీలో ఎవరూ నా పాదాలు తాకవద్దు, నమస్కారం చేయవద్దు, జైబాబా అని కూడా చెప్పొద్దన్నారు. ఇక్కడ కార్యక్రమం ముగిశాక, నేను మెహెరాజాద్‌కు తిరిగి వెళ్ళే సమయంలో మర్యాదపూర్వకంగా కూడా, తన వెనుక ఎవరూ రావొద్దన్నారు.

## 1958 జూలై 14 నుండి నవంబర్ 30

**అంతేకాదు, 1958 జూలై 14 నుండి నవంబర్ 30 వరకు నాలుగున్నర మాసాలు బాబాని** ఎవరూ దర్శించ రాదన్నారు. మెహెరాబాద్‌లో వుండే మండలివారు కూడా తనను దర్శించ రాదన్నారు. బాబాతో ఉత్తరప్రత్యుత్తరాలు చేయరాదన్నారు. మీకు ఎంతటి విపత్కర పరిస్థితులు ఎదురైనా, టెలిగ్రాంలు కూడా పంపవద్దన్నారు. బాబా కార్యదర్శి ఆదీ కె ఇరానీ కూడా నేను పిలువనిదే మెహెరాజాద్‌కు రాకూడదని ఆదేశించానన్నారు. నాకు ఏరుచ్ ఎంత ముఖ్యుడో మీ అందరకూ తెలుసు. రాత్రనకా, పగలనకా అతడు నా వెన్నంటి ఉంటాడన్న సంగతి మీకు తెలుసు కదా అన్నారు. అలాంటి ఏరుచ్‌ని కూడా నా ఈ నాలుగున్నర మాసాల ఏకాంతవాస సమయంలో నా నుండి దూరంగా మెహెరాబాద్‌లో ఉండాలని ఆదేశించానన్నారు. తొలిసారిగా ఏరుచ్ నా నుండి దూరంగా వుంటున్నాడు. దీంతో నేను చేపట్టబోయే ఏకాంతవాసం ఎంత కఠినమైనదో మీకు అర్థమయి వుంటుందన్నారు. కాబట్టి, నా ఆదేశాలను పాటిస్తూ పైన పేర్కొన్న సమయంలో నాతో కానీ, మండలి వారితో కాని ఎలాంటి ఉత్తర ప్రత్యుత్తరాలు జరుపవద్దని మరోమారు బాబా హెచ్చరించారు. ఆ తర్వాత **బాబావారిచ్చిన విశ్వ సందేశాన్ని ఏరుచ్ చదివి వినిపించాడు.**

**అనంతరం, జూలై 11 మధ్యాహ్నానికి అందరూ మెహెరాబాద్ వదిలి, బరువెక్కిన హృదయాలతో** తమ ప్రాంతాలకు తరలి వెళ్ళారు. మెహెర్‌బాబా ఇచ్చిన విశ్వ సందేశానికి నేటికి 68 సంవత్సరాలు నిండాయి. బాబావారి 'విశ్వసందేశం' ప్రక్క పేజీలలో పరిశీలించండి.

**– అవతారుడు ఇచ్చిన విశ్వ సందేశం ప్రక్క పేజీలలో**

☞

# విశ్వ సందేశం

## మెహెరాబాద్, 1958 జూలై 10



**నేను బోధించుటకు రాలేదు. మానవాళిని మేల్కొల్పడానికే అవతరించాను. కాబట్టి ధర్మ** సూత్రాలను నిర్దేశించను. ఇది మీరు గ్రహించాలి. అనాదిగా ఎన్నో ధర్మ సిద్ధాంతాలు చెప్పాను. హితోపదేశాలు చేశాను. కానీ మానవాళి వాటిని పట్టించుకోలేదు. పరమాత్మ చెప్పిన ప్రకారం జీవించలేని మనిషి దౌర్భల్యం అవతారుని బోధనలని అపహాస్యం చేస్తోంది. పరమాత్మ ఏం చెప్పాడు? దయ, జాలి, కరుణ చూపమన్నాడు. కానీ మనిషి ఆ పని చేయలేదు. సరి కదా, దేముని పేరు చెప్పి ధర్మయుద్ధాలు చేశాడు. వినమ్రత, పవిత్రత, సత్యం – ఇవీ భగవంతుని ఉవాచ. ఇలా వుండకుండా, ద్వేషం పెంచుకొంటున్నాడు. దురాశకి లోనవుతున్నాడు. దౌర్జన్యానికీ, హింసకీ పాల్పడుతున్నాడు. గత అవతారకాలంలో పరమాత్మ ప్రసాదించిన ధర్మ సూత్రాలనీ, విధులనీ మనిషి పెడచెవిని పెట్టాడు. అందుకనే, ఈ అవతారకాలంలో నేను మౌనం పాటిస్తున్నాను.

**ఇది వరకు అంటే, పాత అవతారాలప్పుడు, మీరు అడిగారని నేను చెప్పాను చాలా సంగతులు.** అవి చాలు. వాటిని ఆచరించాల్సిన సమయమిది. భగవంతునికి దగ్గరగా, ఇంకా దగ్గరగా వెళ్ళాలి అంటే? "నేను" అనే భావానికి దూరంకండి. "నాది" అనే భావాన్ని ప్రక్కకి నెట్టండి. "నాకు" అనే చింతనకు దూరంగా వుండండి. నేను, నాది, నాకు అనే మూడింటికి దూరమయిన కొద్దీ భగవంతుడికి దగ్గరవుతారు. ఈ మూడు భావాలకి, నేను, నాది, నాకు అన్న భావనకి ఎంతగా దూరమయితే, అంత చేరువగా అవుతారు భగవంతుని సన్నిధికి. భగవన్మార్గంలో మీరేమీ వదిలిపెట్టనక్కర్లేదు. నేను అన్న అహంకారానికి తిలోదకాలు ఇస్తే చాలు. ఈ మాటవింటుంటే ఇది చాలా తేలిక అనిపిస్తుంది కానీ

ఆచరణలో కష్టం. ఇంచుమించుగా అసాధ్యమే. అయితే, నా అనుగ్రహం వల్ల అహం, స్వార్థం వదిలిపెట్టడం వీలవుతుంది మీకు. ఆ మహత్తర అనుగ్రహాన్ని మానవాళికి ప్రసాదించడానికే అవతరించాను నేను. మరోసారి చెప్తున్నాను. ధర్మసూత్రాలని నిర్దేశించడంలేదు నేను ఈ అవతారకాలంలో. సత్య ప్రేమవాహినిని ప్రసాదించడానికే నేను వచ్చాను. ఆ ప్రేమవాహినీ కెరటాన్ని నేను విడుదల చేయగానే మనుష్యుల నిత్య జీవితం ధర్మ బద్ధమైన జీవన విధానానికి ప్రతీక అవుతుంది. నా నోటగా చెప్పని ఉపదేశాలు దైనందిన జీవితంలో ప్రతిఫలిస్తాయి. అజ్ఞానమనే తెర మనిషి స్వంతం. ఆ తెర వెనుక దాగి వుంటాను నేను. అయితే నా దివ్య దైవత్వాన్ని కొద్దిమందికి ప్రకటిస్తాను.

## ఈ యుగంలో నా అవతారమే ఆఖరి అవతారం

**ఈ యుగంలో నా అవతారమే ఆఖరి అవతారం. అందువల్ల నా అవతార వ్యక్తీకరణ** ఘనాతి ఘనంగా వుంటుంది. నేను మౌన విరమణ చేయగానే నా దివ్య ప్రేమ స్పర్శ ప్రభావం విశ్వమంతటా వుంటుంది. జీవకోటి యావత్తూ నా దివ్య ప్రేమని తెలుసుకుంటుంది. నా ప్రేమ మధురిమను చవిచూస్తుంది. నా ప్రేమను పొందుతుంది. అప్పుడు ఏమవుతుందీ అంటే, ప్రతి ఒక్కరూ బంధ విముక్తులు అవుతారు. ఎవరికి తగ్గట్లు వాళ్ళు ఎంచుకున్న రీతిలో ఈ బంధ విముక్తి పొందుతారు. దివ్య ప్రియతముడిని నేను. మీరంటే ఎంతో ప్రేమ. బహుశా మీరు కూడా మీకోసం కొట్టుకుపోనంతగా మీ పట్ల నా ప్రేమ వుంది. ఆత్మస్వరూప జ్ఞానం మీరు పొందడానికి మౌన విరమణ దోహదం చేస్తుంది. ప్రపంచంలో ఇప్పుడున్న సంక్షోభం, చెలరేగుతున్న కల్లోలం తప్పదు. ఈ పరిస్థితులకి ఎవరూ నిందార్హులు కారు. ఏది జరగాలని వుందో అదే జరిగింది. ఏమి జరగాలో ముమ్మందు అది జరిగి తీరుతుంది. ఇటువంటి పరిస్థితుల నుంచి మానవాళి తప్పించుకోవాలంటే, గతంలో కానీ ఇప్పుడు కానీ ఒక్కటే దారి వుంది. అది మీ మధ్యకు నేను రావటం తప్ప మరో గత్యంతరం లేదు.

**నేను రావాల్సి వుంది, వచ్చాను. నేను సనాతన పురుషుడను.**

*****

# గాజువాక కేంద్రంలో

**1952 మే 24వ తేదీన అమెరికాలోని ఓక్లహోమాలో అవతారునికి జరిగిన ఘోర కారు** ప్రమాదాన్ని స్మరించుకుంటూ, గాజువాక బాబా ప్రేమికులు ప్రత్యేక సత్సంగ్ కార్యక్రమం నిర్వహించినట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీ రఘుపతి బెంగళూరు ప్రమాద సంఘటన అంశాన్ని కళ్ళకుకట్టినట్లు వివరించారు. శ్రీ మెహెర్ సంగీత్ బాబా భజన గీతాలను చక్కగా ఆలాపించాడు.

# అవతారుని పాదసేవ - బాబా సందేశం

**మానవుని పాదాలు భౌతికంగా దేహానికి చివరిన** వున్నా, ఆధ్యాత్మికంగా చాలా ఉన్నతస్థితిలో వుంటాయి. అనేక మంచి లేదా చెడు ప్రదేశాలలో పాదాలతో నడుస్తారు. పరిశుభ్రమైన లేదా అపరి శుభ్ర ప్రదేశాలలోనూ మీరు పాదాలతో నడుస్తారు. ఎక్కడ ఎలా నడిచినా పాదాలు అన్నింటికన్నా ఉన్నతమే అన్నారు బాబా.

ఆధ్యాత్మికంగా సద్గురువు యొక్క పాదాలు యావత్తు విశ్వంలో అన్నింటికంటే సర్వోన్నతమైనవి. సాధారణ ప్రజలు సద్గురువు పాదాలపై తమ తలలు ఆనించి తాకినప్పుడు, వారి సంస్కారాల భారం సద్గురువుకు అప్పజెప్పినట్లౌతుంది. సాధారణ ప్రజలు నడుస్తున్నప్పుడు తమ పాదాలపై దుమ్ము-ధూళి పోగుచేసుకున్నట్లు, యావత్తు ప్రపంచం నుండి సద్గురువు సంస్కారాలను ప్రోది చేసుకుంటాడని బాబా అన్నారు.

## తేనె, పాలు ప్రాశస్త్యం

**సద్గురువుని ఆరాధించేవారు సద్గురువు పాదాలను తేనె,** పాలు, మంచినీటితో కడుగుతారు. తేనె మానసిక సంస్కారాల నిర్మూలనకు (ఎర్రని సంస్కారాలు) సహాయపడుతుంది. పాలు సూక్ష్మ దేహ సంస్కారాల (తెల్లని సంస్కారాలు) నిర్మూలనకు సహాయపడతాయి. మంచినీళ్ళు - స్థూల దేహ సంస్కారాల (పసుపు రంగు సంస్కారాలు) నిర్మూలనకు దోహదపడతాయి. కొంతమంది భక్తులు సద్గురువు పాదాల దగ్గర కొబ్బరికాయ కొడతారు. నారికేళం మనస్సును సూచిస్తుంది. సద్గురువుకి సంపూర్ణ అంకితభావానికి నిదర్శనంగా నారికేళం సమర్పిస్తారని బాబా అన్నారు.

***

**1937 ఫిబ్రవరి 18న**
అవతారుని 43వ జన్మదినోత్సవం.
ఈ వేడుకలలో బాబా తన ప్రేమికులనందర్నీ తన పాదాలు తాకేందుకు అనుమతించారు. మండలి సభ్యులు బాబా పాదాలకు తేనె, పాలు, ఆ పిదప నీళ్ళతో అభిషేకరించి ఆ పానీయాలను ప్రసాదంగా స్వీకరించారు. మెహెర్‌బాబా తన పాదాలు తాకడానికి అంగీకరించేవారు కాదు. బాబా బహిరంగ దర్శన సమయాల్లో, బాబా పాదాలు తాకరాదని హెచ్చరిస్తూ, మండలివారు మైకులో ప్రకటనలు చేసేవారు. పొరపాటున ఎవరైనా బాబా పాదాలు తాకితే కూడా అవతారునికి తీవ్ర కోపం వచ్చేది. అలాంటిది, ఈ జన్మదిన వేడుకలలో బాబా ప్రత్యేకంగా ప్రతి ఒక్కరూ ఆయనకు పాదాభివందనం చేసే అవకాశం కల్పించారు.

***

# విశాఖపట్నం కేంద్రంలో గాడ్ స్పీక్స్‌పై వర్క్ షాపు



**విశాఖపట్నంలోని 'సిటీ సెంటర్'లో 2026 మే 23వ తేదీన, అలాగే, స్థానిక మెహెర్** నిలయంలో మే 24న రెండ్రోజులపాటు అవతారుడి స్వీయరచన భగవద్వచనంపై శ్రీ రఘుపతి రావు, బెంగళూరు, విశేష ప్రసంగం చేశారు. శ్రీ రఘుపతి గారి ప్రసంగం బాబా ప్రేమికుల్ని ఎంతగానో ఆకట్టుకుంది. పలువురి సందేహాలకు శ్రీ రఘుపతి సోదాహరణ సమాధానాలు ఇచ్చారని, కార్యదర్శి శ్రీ ఎన్వీయస్ రామారావ్ ఒక ప్రకటనలో తెలిపారు.

## మెహెరామాయి సంస్మరణ – మహిళా సహవాస్

**ప్రియతమ మెహెరామాయి 1989 మే 20న బాబాలో ఐక్యమయ్యింది. అవతారుని** సేవలో – ప్రేమలో మెహెరామాయి తరించిన వైనాన్ని గుర్తుచేసుకుంటూ, విశాఖ కేంద్ర మహిళా ప్రేమికులు ప్రత్యేక ప్రేమిక సహవాస్‌ని 2026 మే 17న నిర్వహించారు. ఈ సహవాస్‌లో పలువురు మహిళలు ఉత్సాహంగా భజన గీతాలు ఆలాపించారు. బాబా సందేశాలపై ప్రసంగాలతోపాటు, లఘు నాటికలు ప్రదర్శించినట్లు నిర్వాహకులు శ్రీమతి పి. బాయి మెహెర్, శ్రీమతి పి. పావని ఒక ప్రకటనలో తెలిపారు.

# విజయనగరం కేంద్రంలో ఏకనామం

**1952 మే 24వ తేదీన అమెరికాలోని ఓక్లహోమాలో అవతారునికి జరిగిన ఘోర కారు** ప్రమాదాన్ని స్మరించుకుంటూ, విజయనగరం బాబా ప్రేమికులు ఏకనామం నిర్వహించినట్లు శ్రీ కామేశ్వరరావు అధ్యక్షులు ఒక ప్రకటనలో తెలిపారు.

# విజయనగరం కేంద్ర నూతన కార్యవర్గం



**అవతార్ మెహెర్‌బాబా విజయనగరం కేంద్రానికి 2026-2028 (రెండు సంవత్సరాలకు) గాను, 2026 మే 16న ఎన్నిక నిర్వహించి, ఈ క్రింది నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు.**

**శ్రీ దాసరి వెంకటరావు - గౌరవ అధ్యక్షులు,**

శ్రీ టి. కామేశ్వరరావు - అధ్యక్షులు, శ్రీ పి.జి. ప్రసాద్ - వైస్ ప్రెసిడెంట్

శ్రీ పీతల ప్రసాద్ - కార్యదర్శి, శ్రీ యు. శ్రీనివాసరావు, సంయుక్త కార్యదర్శి

డి. శాంతి - సంయుక్త కార్యదర్శి, శ్రీ కె. నాయుడు - కోశాధికారి

**కార్యవర్గ సభ్యులుగా: సర్వశ్రీ**

సోమరాజు, డి. రాధ, శివరాం, సిహెచ్. లావణ్య, ఇ. రమణ, బంగారు సూరి, కె. రమేష్, యం.సత్యవతి, జి. శంకరరావు ఎంపికయ్యారని తెలిపారు.

## మౌనం రెండు రకాలు

**మౌనం రెండు రకాలన్నారు బాబా. 1. బాహ్యంగా –నోరు మెదపకుండా మౌనం పాటించడం. 2. ఆంతరంగికంగా - మనస్సును కట్టడి చేస్తూ మౌనం పాటించడం. పెదవులు మూసుకుని** బాహ్య మౌనం పాటించడం తేలికైనదే. ఐతే, ఆంతరంగిక మౌనం చాలా కష్టమని బాబా అన్నారు. ఆంతరంగిక మౌనంలో మనస్సును మౌనంగా ఉంచే ప్రయత్నం చేయండి. నాలికతో మనం మాట్లాడతాం. పెదవులు మూసేస్తే, అది బాహ్య మౌనం అవుతుంది. మనస్సుకు కూడా ఒక నాలుక వుంటుంది. అది నిరంతరం మాట్లాడుతూనే వుంటుంది. కాబట్టి, మౌనంలో మనస్సు యొక్క పెదవులను గట్టిగా మూసివేయాలన్నారు బాబా.

# ఉడతారాలో ప్రత్యేక ప్రేమిక సహవాస్




**అమెరికాలోని ఓక్లహోమా సమీపంలో అవతారునికి జరిగిన కారు ప్రమాద సంఘటనని** గుర్తుచేసుకుంటూ, 2026 మే 24న సతారాకు సమీపంలోని ఉడతారాలో ప్రత్యేక ప్రేమిక సహవాస్ సా. 4 నుండి రాత్రి 8 వరకూ నిర్వహించారు. ఈ సహవాస్ కార్యక్రమాన్ని ఉడతారాలో బాబాకి జరిగిన రెండవ కారు ప్రమాద స్థల సమీపంలో నిర్వహించడం విశేషం. ఈ సహవాస్‌కి ముఖ్య అతిథిగా హాజరైన బాబా ట్రస్టు సభ్యులు శ్రీ ప్రసాద రాజు మాట్లాడుతూ, ఇకపై ఉడతారాలో తరచు ప్రేమిక సహవాస్‌లు ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. శ్రీ ప్రతాప్ ఆహిర్, శ్రీ ప్రశాంత్ ఆహిర్, పూణే కేంద్రం, ఆనాడు బాబావారికి జరిగిన రెండు కారు ప్రమాదాల గురించి, వాటి వెనుక వున్న ఆధ్యాత్మిక ప్రాధాన్యత గురించి క్లుప్తంగా వివరించారు. పూణే, మెహెరాబాద్, అహిల్యానగర్ కేంద్రాల నుండి పలువురు బాబా ప్రేమికులు పాల్గొన్నారు. ఉడతారాలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు డాక్టర్ వాసుదేవ్, పంచగని పేర్కొన్నారు.

# నర్సీపట్నం బాబా కేంద్రంలో

**అమెరికాలోని ఓక్లహోమా సమీపంలో అవతారునికి జరిగిన కారు ప్రమాద సంఘటన** గుర్తుచేసుకుంటూ, మే 24న నర్సీపట్నం బాబా కేంద్రంలో బాబావారి ఏకనామ సంకీర్తన నిర్వహించినట్లు శ్రీ పూళ్ళ సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న శ్రీ కొల్లి రామారావు ఆనాటి ప్రమాద సంఘటన గురించి కళ్ళకు కట్టినట్లు వివరించారు. ఈ ప్రమాదం అవతారుని దైవీ ప్రణాళికలో భాగమని ఆయన చెప్పారు. అనకాపల్లి, పలాస, భీమిలి బాబా కేంద్రాల ప్రేమికులు పాల్గొన్నారు.

# మెహెర్‌బాబా పత్రిక
# ముద్రణ, రవాణా ఖర్చులు




**పత్రిక ముద్రణ, రవాణా, నిర్వహణ ఖర్చులు అనూహ్యంగా పెరిగాయి. సుమారు** పదేళ్ళ క్రితం వరకూ జాతీయ బ్యాంకుల్లో ఫిక్స్‌డ్ డిపాజిట్‌లపై బ్యాంకు వడ్డీ 12 శాతం వరకూ వుండేది. ఆ కారణంగానే, వార్షిక చందా రూ. 100/-, జీవిత సభ్యత్వం రూ. 1000/- నిర్ణయించాం. జీవిత సభ్యులు చెల్లించిన నగదుపై వచ్చే వడ్డీని మాత్రమే పత్రికా నిర్వహణలో నేటికీ వినియోగిస్తున్నాం.

**నేడు బ్యాంకులు ఇస్తున్న వడ్డీ రేట్లలో గణనీయమైన మార్పు వచ్చింది. ఆ కారణంగా ఈ క్రింది నిర్ణయాలు తప్పనిసరి పరిస్థితుల్లో ప్రతిపాదించడ మైంది. 1.వార్షిక సభ్యత్వం రూ. 150/-, 2. జీవిత సభ్యత్వం రూ. 2,000/- గా మార్పు చేయడమైంది. ప్రస్తుతం వున్న జీవితసభ్యులు, అంటే ఇంతక్రితం వెయ్యి రూపాయలు మాత్రమే చెల్లించిన వారు కూడా,** వీలున్న మేరకు, మా ప్రతిపాదనను మన్నించి అదనపు వెయ్యి రూపాయలు మీ వీలువెంబడి పత్రిక చిరునామాకు పంపవల్సిందిగా కోరుతున్నాం.

**మా ఈ విజ్ఞప్తిని మన్నించి ఇప్పటికే చాలామంది అదనపు వెయ్యి రూపాయలు చొప్పున పంపుతున్నారు.** జీవిత సభ్యుల చెల్లింపుల వివరాలు ప్రతినెలా పేజి 40లో ప్రచురిస్తున్నాం. పాఠకులు గమనించగలరు. **మీ సహకారం కోరుతూ, మీ సూచనలు, సలహాలు మా వాట్సప్ నంబర్ 99595 53218 తెలియజేయగలరు. జైబాబా.**

## మూగవాని మౌనం

**మౌనం పాటించే ముందు మీ మనస్సును నియంత్రించమన్నారు బాబా. మనస్సు మౌనంగా** ఉన్నప్పుడు బాహ్యంగా మీరు పాటించే మౌనం జయప్రదమౌతుంది. నిత్యం మనం ఎందరో మూగవారిని చూస్తాం. వారు మాట్లాడలేని మౌనం వల్ల ఏమి ప్రయోజనం ఉంటుందని? బాబా ప్రశ్నించారు. మౌనం రోజున మనస్సుని, హృదయాన్ని నిశ్శబ్దంగా ఉంచడానికి ప్రయత్నించండి. మీకు అన్ని విధాల సహాయం అందిస్తానన్నారు బాబా. ఊపిరి తీసుకుంటూ కూడా బాబా నామస్మరణ చేయడం అలవరచుకుంటే, అవతారుని దివ్య నామస్మరణ బాబా ప్రేమికులకు నిత్యకృత్యం అవుతుంది.

# బాబా-నాకొక-వరం కావాలి

**హిందీ మూలం: 'దే ఇతనా వరదాన్' - శ్రీ మధుసూదన్ అండ్ పార్టీ**

**తెలుగు సేత: శ్రీ పి.ఎస్.కె. శర్మ, హైదరాబాద్**

**వరమొసంగు దేవా, మెహెర్‌బాబా**
ఈ వర మొసంగుమా
నిను ధ్యానింతును,
నిను భజియింతును,
వేరొక వరమడుగనుగా బాబా.

చ॥ నీ నామమొసగుము నా మాటలలో
నీ కార్య మొసగుము నా చేతలలో
నా కవిత్వమున నీ గానముతో
నిను ముగ్ధునిగా చేతును బాబా వ॥

చ॥ తనువుకు మనసుకు కారణమీవే
జనన మరణములు నీ కారణమే
జీవన లక్ష్యము నీవే కాదా
మట్టి కుండలో ప్రాణుల మేము వ॥

చ॥ మాయా మోహ సంస్కార బాటలో
త్రోవ తప్పితిమి ఎన్నో జన్మలు
బంధ విముక్తుడ నెపుడు చేతువో
కరుణతో కృప చూప రావా బాబా వ॥

చ॥ ఏ మార్చి పోయిన నిను చేరవస్తే
సహకరించదీ చంచల మనస్సు
నీ నుండి నేనూ దూరమైననూ
మెహెరు ధ్యానము వదలను బాబా వ॥

# అవతార్ మెహెర్‌బాబా ఎవరు?

**లోకంలోని విరోధాలన్నీ ప్రేమతో మాత్రమే సమసిపోతాయని ప్రబోధించారు మెహెర్‌బాబా. ఆయన 44 సంవత్సరాలు మౌనంలో ఉన్నారు. ప్రతి ఏటా జూలై 10వ తేదీన ఆయన భక్తులందరూ మౌనవ్రతాన్ని ఆచరిస్తారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని...**

## మెహెర్‌బాబా మౌనం

**ప్రేమతో ఎంతటి విరోధినైనా జయించగలమని మెహెర్‌బాబా ప్రబోధించారు. ముఖ్యంగా** బాధలలో, కష్టాలలో ఉన్నవారిని బాబా ప్రేమించారు. 'ఏ కోర్కెలు లేకుండా జీవించేలా తనను కోరుకోమని చెప్పేవారు. మీ కోర్కెలు తీర్చలేను. కానీ మీ అవసరాలకు ఆదుకుంటానని ఆయన భక్తులకు ఉపదేశించారు. బాబా తాను ఏ కొత్త మతం, సంఘం లేదా సమాజ స్థాపన కోసం రాలేదని స్పష్టం చేశారు.

## జీవిత విశేషాలు

**మెహెర్‌బాబా అసలు పేరు మేర్వాన్. మహారాష్ట్రలోని పూణేలో 1894 ఫిబ్రవరి 25న** జన్మించారు. 125 సంవత్సరాల మహిళ హజరత్ బాబాజాన్ ఆయన నుదుటన రెండు కనుబొమ్మల మధ్య ముద్దాడింది. అప్పటి వరకు ఎంతో ఉత్సాహంగా ఉన్న మేర్వాన్ బాహ్య ప్రపంచంతో తెగతెంపులు చేసుకున్నవాడిలా మతిస్థిమితం లేనివాడయ్యాడు. ఆయన తల్లిదండ్రులు అతని పరిస్థితి అంతుబట్టని స్థితిలో పంచ సద్గురువుల దర్శనం చేయించారు. వారిలో షిరిడీ సాయిబాబా ఒకరు. షిరిడీ సాయి తొలిసారిగా ఆయనను చూస్తూనే 'ఓ పర్వర్దిగార్' అని సంబోధించారు.

## 44 సంవత్సరాలు మౌనం

**31 సంవత్సరాల వయసులో బాబా మౌనం చేపట్టారు. తొలిరోజుల్లో ఇంగ్లీషు అక్షరాలు గల** పలకతో తాను చెప్పదలనుకున్న విషయాలను తెలిపేవారు. ఆ తరువాత కేవలం సంజ్ఞలతోనే తన సందేశాలను మానవాళికి అందించారు. మౌనంలోనే నా మాటలు మీ హృదయాలకు నేరుగా అర్థమవుతాయని బాబా అనేవారు. అలాగే ఆయనను అడిగే సందేహం తీర్చుకోవాలనుకునే వారికి ఆయన దర్శనమైనంతనే జవాబులు దొరికిపోయేవి. రెండవ రౌండ్ టేబుల్ కాన్ఫరెన్స్‌కు హాజరవడానికి వెళుతూ రాజపుటానా ఓడలో మహాత్మా గాంధీ బాబాను దర్శించారు. ఆయన దాదాపు కొన్ని గంటలపాటు బాబా సన్నిధిలో

గడిపారు. సుదీర్ఘంగా 44 సంవత్సరాలపాటు మౌనంగా ఉంటూనే అనేక ఆధ్యాత్మిక సందేశాలు ఇచ్చారు. 1925 జూలై 10 నుంచి 1969 జనవరి 31 వరకు, అంటే ఆయన భౌతిక దేహం వదిలే వరకూ మౌనంలో ఉండగానే ఆయన గాడ్ స్పీక్స్, ఎవ్రిథింగ్ అండ్ నథింగ్, డిస్కోర్సెస్, లైఫ్ ఎట్ ఇట్స్ బెస్ట్ అనే ఆధ్యాత్మిక గ్రంథాలు రచించారు. ప్రతి ఏటా జూలై 10వ తేదీన ఆయన ప్రేమికలందరూ రోజంతా మౌనం పాటిస్తారు. ఇది ఆయన స్వయంగా మౌనం ప్రారంభించిన రోజు.

**గత అవతారాలలో తాను శ్రీరామునిగా, శ్రీకృష్ణుడిగా, ఏసు ప్రభువుగా, బుద్ధుడిగా, ప్రస్తుత కాలంలో** అవతార్ మెహెర్‌బాబాగా మానవరూపధారియైన భగవంతునిగా, అవతరించానని మెహెర్‌బాబా ప్రకటించారు. ఈ అవతారకాలంలో మెహెర్‌బాబా తాను ప్రత్యేకంగా ఎలాంటి మతం స్థాపించ రాలేదని, అన్ని మతాలు ఒక్కటేనని, తన మతం "ప్రేమ" అని ప్రకటించారు.

## మహత్యాలు చేయను

**తానేమీ మహత్యాలు చేయనని మెహెర్‌బాబా అనేకమార్లు ప్రకటించారు. ఐతే, బాబా మా** ఊపిరికన్నా దగ్గరగా వున్నారని, మా అవసరాలకు, ఆపదలో ఆదుకుంటాడని ఆయన ప్రేమికులు అంటారు. ఆధ్యాత్మిక ఆనందం అనంతమైనది, శాశ్వతమైందని అన్నారు బాబా. మానవ జీవిత లక్ష్యమైన మోక్షం సాధించే వరకూ మానవులకు జనన మరణాలు తప్పవు. పునరపి మరణం – పునరపి జననం. ఈ చక్రం కొన్నివేల సంవత్సరాలు కొనసాగుతుంది. మనస్సు ఒక్కసారే జన్మిస్తుంది. ఒక్కసారే చనిపోతుంది. అంటే మనస్సుకు మరో జన్మంటూ వుండదని బాబా స్పష్టం చేశారు. నిరంతర భగవన్నామస్మరణలో గడపమని బాబా హితవు చెప్పారు. దేవుడు ఎల్లవేళలా నీకెదురుగా ఉన్నాడన్న ఉనికితో ప్రవర్తించమని హెచ్చరించారు.

## విశ్వ మానవాళికి ప్రార్థనలు

**యావత్తు మానవాళి కోసం 1952 నవంబరులో పశ్చాత్తాప ప్రార్థన, 1953 ఆగస్టులో 'ఓ** పర్వర్దిగార్' పేరిట యూనివర్శల్ ప్రేయర్ ఇచ్చారు. ఈ దైవీ ప్రార్థనలు మతాతీతమైనవి. ఉన్నది – దేవుడు ఒక్కడే అనే ప్రవచనాన్ని నొక్కి చెప్పేలా వుంటాయి ఈ ప్రార్థనలు. మహారాష్ట్రలోని అహమ్మద్‌నగర్ జిల్లాలో మెహెరాబాద్‌లో మెహెర్‌బాబా సమాధి ఉంది. మనుషుల మధ్య ద్వేషాన్ని పోగొట్టి ప్రేమతత్వాన్ని అలవరిచే మెహెర్‌బాబా బోధనలు నేటి తరానికి అనుసరణీయాలు.

**– ఆంధ్రజ్యోతి దినపత్రిక సౌజన్యంతో**

# మా ప్రచురణలు




























ప్రతులకు ఫోన్ : **99595 53218** సంప్రదించగలరు

# అదనపు జీవిత సభ్యత్వం

**2026 మే - జూన్ నెలలలో పంపిన వారి వివరాలు**

1. శ్రీ ఏ. జనార్ధనరావు, నిజామాబాద్ రూ. 1000/-
2. శ్రీ కెయం. రావు, హైదరాబాద్ రూ. 1000/-
3. శ్రీ కె. సూర్యనారాయణ మూర్తి, మల్కిపురం, తూగోజి రూ. 1000/-
4. శ్రీ జె. ఉషాకిరణ్, అనకాపల్లి, విశాఖ జిల్లా రూ. 1000/-
5. శ్రీ బిక్కిన వెంకటరావు, పగడదిన్నె క్యాంపు, కర్నాటక రూ. 1000/-
6. శ్రీ ఐ. సన్యాసిరాజు, విశాఖపట్నం రూ. 1000/-
7. శ్రీ బచ్చుల నాగేశ్వరరావు, వినుకొండ, పల్నాడు జిల్లా రూ. 1000/-

---

**మెహెర్‌బాబా పత్రిక జీవిత సభ్యత్వం రూ. 2000/-.**

**ఆన్‌లైన్‌లో పంపగోరువారు**

శ్రీమతి శారద, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు, సైనిక్‌పురి బ్రాంచి, సికింద్రాబాద్.

**SB A/C NO: 173201000029152, IFSC CODE: IOBA 0001732.**

**మెహెర్‌బాబా పత్రిక వార్షిక సభ్యత్వం రూ. 150/-.**

**ఆన్‌లైన్‌లో పంపగోరువారు**

శ్రీమతి శారద, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు, సైనిక్‌పురి బ్రాంచి, సికింద్రాబాద్.

**SB A/C NO: 173201000027973, IFSC CODE: IOBA 0001732.**

సభ్యత్వం పోస్టులో మనీ ఆర్డర్, బ్యాంకు చెక్కు, లేదా డిమాండ్ డ్రాఫ్ట్ ద్వారా పంపగోరువారు ఈ క్రింది పోస్టలు అడ్రస్సుకు పంపవల్సింది.


**మా అడ్రస్:**

**ఎడిటర్, మెహెర్‌బాబా, గోదావరి గార్డెన్స్,**

**బాబాస్ హౌస్,** యాప్రాల్, ప్లాట్ నెం.32, జె.జె. నగర్ కాలనీ పోస్టు,

సికింద్రాబాద్-500087.

**ఫోన్: 99595-53218. email: malladisukku@gmail.com**


---


Printed and published and owned by Dasika Nirmaladevi printed at Caxton Printers, Lakdi-ka -Pul, Hyderabad, published at Koti Meher Centre, Esamia Bazar, Koti, behind Govt. Women's College, Hyderabad. **Editor: D. Nirmaladevi**

---

**RNI No. APTEL/2002/7310, Posted at Patrika Channel, Nampally, Hyderabad.**